# మల్కం చెరువు మునకకు కారణమేంటి..?



మల్కం చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ ఎ.వి.రంగనాథ్ తదితరులు

**అధికారులతో హైడ్రా కమిషనర్ సమీక్ష - గచ్చిబౌలి ప్రాంతాల్లో పర్యటన**

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మల్కం చెరువు పరిసరాల్లో వరద పోటెత్తడానికి గల కారణాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం ఉదయం సమీక్షి ంచారు. వరద ముంచెత్తడానికి, ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడడానికి కారణాలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. చెరువుకు వచ్చే వరద పెద్దమొత్తంలో ఉండి.. బయటకు వెళ్లేది ఆ స్థాయిలో లేకపోవడంతో సమస్య తలెత్తిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అలుగు పారడం ద్వారా మాత్రమే నీరు బయటకు వెళ్తోందని.. స్లూయిజ్ గేట్లు కూడా ఏర్పాటు చేస్తే.. వర్షాకాలంలో నీటిమట్టాన్ని తగ్గించడానికి వీలౌతోందని చెప్పారు. వర్షాలు మిగతా 3లో





దుకాణాలలో రాఖీ కొనుగోళ్ల సందడి

## పౌర్ణమి గిరాఖీ

శనివారం రాఖీపౌర్ణమి. తోడబుట్టినవారికి పండుగ. ఈ నేపథ్యంలో నగరంలో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా రాఖీ విక్రయ కేంద్రాలే.విభిన్న ఆకృతుల్లోని రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. ముచ్చటగొలుపుతున్నాయి. గి'రాఖీ'కి కూడా పెరిగింది. రాఖీల కోసం మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆకట్టుకునే రాఖీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.ఈ సందర్భంగా సిటీలోని ఫ్యాన్సీ, స్వీట్ షాపులు శుక్రవారం కిటకిటలాడాయి. తమ సోదరులకు రాఖీ కట్టేందుకు యువతులు, మహిళలు రాఖీలు, స్వీట్లు కొంటూ కనిపించారు.

-ప్రభాతవార్త, హైదరాబాద్



చార్మినార్‌న వద్ద భాగ్యలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు

## వరాల తల్లీ.. కల్పవల్లీ

**భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వత్రాలు**

**కిటకిటలాడిన ఆలయాలు**

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** నగరంలో శ్రావణ శుక్రవారం శోభ పరిఢవిల్లింది. గృహిణులు వరలక్ష్మీ వ్రతం ఆచరించి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సిరి సంపదలతో తులతూగాలని వేడుకున్నారు. 'ఇస్తినమ్మ వాయ నం.. పుచ్చుకుంటినమ్మ వాయనం' అంటూ మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపు చ్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రవణ శుక్రవారం జరిగిన వరలక్ష్మీ వ్రతం పూజలు ప్రతి ఇంట మిగతా 3లో



# ఆశల ఉచ్చు

**సైబర్ మోసాలు ఎలా జరుగుతాయో మనకు కంటికి కనించవు. కానీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయి. పదో తరగతి కూడా పాస్ కాని కేటుగాళ్ల చేతులో ఉన్నత విద్యావంతులూ మోసపోతున్నారు.**

**నిరుద్యోగ యువతకు కేటుగాళ్ల వల**

**ఉపాధి అవకాశాల పేరుతో మాయమాటలు**

**ప్రాసెసింగ్ ఫీజు చెల్లిస్తే జాబ్ గ్యారెంటీ వాగ్దానం**

**కోటి ఆశలతో అడిగినంత చెల్లించి మోసపోతున్న బాధితులు**

(హైదరాబాద్, ప్రభాతవార్త)

♦నారాయణగూడకు చెందిన ఓ నిరుద్యోగికి పార్ట్ టైం ఉద్యోగం పేరిట తన సెల్‌ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. ఉద్యోగం రాక నిరాశతో ఉన్న సదరు వ్యక్తి మేసేజ్‌ను పరిశీలించాడు. అందులో ఉన్న లింక్‌పై క్లిక్ చేశాడు. కాసేపటికి సంబంధిత కంపెనీ ఎగ్జిక్యూటివ్‌నంటూ ఓ యువతి ఫోన్ చేసింది. తమ కంపెనీలో పార్ట్ టైం, ఫుల్ టైం ఉద్యోగాలు ఉన్నాయని చెప్పింది. ఆ నిరుద్యోగి ఆసక్తి కనబర్చటంతో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, ఆ తర్వాత జాబ్ గ్యారెంటీ అంటూ షరతులు పెట్టింది. ఉద్యోగం వస్తే కష్టాల నుంచి గట్టెక్క వచ్చన్న ఆశతో అతను రూ. 65 వేలు సమర్పించుకున్నాడు. రోజులు గడిచినా ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

♦కూకట్‌పల్లికి చెందిన ఓ గృహిణికి పార్ట్ టైం ఉద్యోగం పేరిట టెలిగ్రాం మేసేజ్ వచ్చింది. చిన్న చిన్న టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బు వస్తుందని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. వారు చెప్పిన విధంగా అనుసరిస్తూ ఆమె కొన్ని వీడియోలు చూసి లైక్ కొట్టారు. అనంతరం కొంత డబ్బు పెట్టుబడి పెడితే రూ. లక్షల్లో ఆదాయం వస్తుందని గాలిలో మేడలు కట్టించారు. నమ్మేసిన ఆమె పలు దఫాలుగా రూ.95 వేలు పంపింది. ఆ తర్వాత మోసపోయానని తెలుసుకుని నెత్తీనోరు బాదుకుంది. ఇలా జీవితంపై కోటి ఆశలతో ఉన్న నిరుద్యోగులు చాలామంది సైబర్ నేరగాళ్ల వలలో మిగతా 3లో

# కంటోన్మెంట్ పరిధిలో 3 ఫ్లైఓవర్లు



**రూ. 960 కోట్లతో ప్రత్యామ్నాయ రోడ్లు- త్వరలో టెండర్ల ప్రక్రియకు ఏర్పాట్లు**

**బేగంపేట నుంచి శ్యామ్ లాల్ బిల్డింగ్ వరకు అండర్ పాస్**

**రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు చెక్‌పెట్టేందుకు కసరత్తు**

**నెల రోజుల్లో కెబిఆర్ పార్కు చుట్టూ పనులు**

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** నగరంలో పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్ సిటీ పనులను మరో నెలరోజుల్లో ప్రారంభించేందుకు జిహెచ్ఎంసి ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా ఈ పనులకు సంబంధించి కోర్టు కేసుల్లేని జంక్షన్లలో పనులు మొదలుపట్టాలని ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో హెచ్ సిటీ పనులపై జిహెచ్ఎంసి పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. అలాగే కంటోన్మెంట్ మీదుగా సిటీకి రాకపోకలు సాగించే వాహనదారులకు తలనొప్పిగా మారిన ప్రత్యామ్నాయ రోడ్ల ప్రతిపాదన కొలిక్కి వచ్చిన సంగతి తెల్సిందే. ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణానికి కేంద్ర రక్షణ శాఖ వర్క్ పర్మిట్ ఇవ్వటంతో ప్రస్తుతం జిహెచ్ఎంసి రూ. 960 కోట్ల రోడ్ల పనులకు టెండర్లను ఆహ్వానించే ప్రక్రియను మొదలుపెట్టింది. రోడ్లను ఏర్పాటు చేసేందుకు సేకరించనున్న రక్షణ శాఖకు చెందిన 44 ఎకరాల స్థలానికి ప్రత్యామ్నాయంగా జవహర్ నగర్‌లో స్థలాన్ని కేటాయించేందుకు సర్కారు కూడా దాదాపు సుముఖతను వ్యక్తం చేయటంతో కంటోన్మెంట్ రోడ్ల సమస్య దాదాపు పరిష్కారమైనట్టే. దీనికి తోడు కంటోన్మెంట్‌లో మూడు వంతెనలు టెండర్లు పూర్తయిన తర్వాత ఒక్క కంటోన్మెంట్ రక్షణ శాఖ భూముల్లో జిహెచ్ఎంసి రెండు ఓవర్లు, ఒక రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసింది. త్వరలోనే టెండర్ల ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తోంది. రామకృష్ణాపురం వద్ద రూ.210 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే నిధులను జమ చేయగా, ఇక్కడ రోడ్ అండర్ బ్రిడ్జి మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు మరో రూ.35 కోట్లను జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. దీనికి తోడు వెల్లింగ్టన్, మారెడ్‌పల్లి ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లను కూడా నిర్మించేందుకు జీహెచ్ఎంసీ దృష్టి సారించింది.

రద్దీ ప్రాంతంలో ట్రాఫిక్‌కు పరిష్కారం..

ఇప్పటికే పంజాగుట్ట నుంచి సికింద్రాబాద్ వైఎంసీఏ వరకు పంజాగుట్ట, బేగంపేట, ప్రకాశ్ నగర్, ప్యారడైజ్ ప్రాంతాల్లో నాలుగు ఫ్లై ఓవర్లు అందుబాటులో ఉన్నా, ఆఫీసు వేళల్లో వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తప్పటం లేదు. చినుకు పాటి వర్షం పడిందంటే చాలు గంటల తరబడి వాహనదారులు ఫ్లై ఓవర్ పైనే తడుస్తూ నిల్చుండిపోవల్సిన పరిస్థితి ఏర్పడింది. సికింద్రాబాద్ వైఎంసిఎ నుంచి అటు పంజాగుట్ట, అమీర్ పేట, రాజ్ భవన్ రోడ్డు వైపు వాహనాలు మరింత స్పీడ్‌గా కదిలేందుకు వీలుగా బేగంపేట రసూల్ పురా చౌరస్తా కన్నా కాస్త ముందు నుంచి శ్యామ్ లాల్ బిల్డింగ్ వరకు హెచ్ సిటీ ప్రాజెక్టు కింద అండర్ పాస్‌ను ఏర్పాటు చేసేందుకు జిహెచ్ఎంసి ఏర్పాట్లు చేస్తోంది. దీనికి తోడు ఇటు పంజాగుట్ట నుంచి రసూల్ పురా మీదుగా వైఎంసీఏ వరకు, రసూల్ పురా జంక్షన్ నుంచి మినిష్టర్ రోడ్డు వైపు ట్రాఫిక్ సజావుగా సాగేందుకు వీలుగా రసూల్ పురా మెట్రోరైలు భవన్, మెట్రో స్టేషన్ల మధ్య నుంచి రసూల్ పురా జంక్షన్ మీదుగా మినిష్టర్ రోడ్డు వైపు రూ.150 కోట్లతో 4 లేన్ల యునీ డైరెక్షనల్ ఫ్లై ఓవర్, చిలకలగూడలో రూ.3 కోట్లతో ఆర్ యూబీని, రూ.80 కోట్లతో పాటిగడ్డ వైపు మరో ఆర్‌ఓబి నిర్మించేందుకు కూడా సర్కారు ఆమోదం తెలిపింది.



వరద ప్రభావిత ప్రాంతాల్లో నాలాను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

# నాలాలపై నిరంతర పర్యవేక్షణ

**వర్షాకాలంలో ప్రజలకు ఏ ఇబ్బంది రాకూడదు- జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్టు 8,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షానంతర చర్యలు వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ క్షేత్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలో వర్ష ప్రభావిత ప్రాంతాలను జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోయినుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. టోలిచౌకీ ఎక్స్ రోడ్, హకీంపేట్ కేజీఎన్ నల్లా, మోతి దర్వాజా, అహ్మద్ కాలనీ, లంగర్‌హౌస్ హుడా చెరువు తదితర ప్రాంతాల్లో వర్షం ప్రభావాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్‌తో కలిసి మల్కం చెరువును పరిశీలించి చెరువు నీటి మట్టాలు, ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షి ంచారు. జీహెచ్ఎంసీ క్షేత్ర అధికారులు, సిబ్బంది నీటి పారుదల, ట్రాఫిక్ పోలీసు, హైడ్రా, జల మండలి, డీఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయంగా చేసుకుంటూ వర్షానంతర చర్యల్లో భాగంగా నీరు తొలగింపు, సిల్ట్, చెత్త తొలగింపు, రోడ్ల భద్రత పరమైన చర్యలను చేపట్టారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించుకోవాలని ప్రజలకు కమిషనర్ సూచించారు.

# మూసీ పరసరాల్లో అప్రమత్తం

**1391 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల - లోతట్టు ఏరియాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశం**

**హైదరాబాద్, అగస్టు 8,ప్రభాతవార్త:** వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ మూసి పరివాహక ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం చాదర్ ఘాట్ ప్రాంతంలోని మూసీ నదిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువన అధిక వర్షాలు కురుస్తున్నందున హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నందు ఇన్‌ఫ్లో 1300 క్యూసెక్కుల వర్షపు నీరు చేరడంతో 1391 క్యూసెక్కుల నీటిని మూసి నది ద్వారా దిగువకు వదలడం వలన మూసీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని అన్నారు. అలాగే లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అన్ని బృందాలు కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే రక్షణ చర్యలలో భాగంగా ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించడం జరిగిందని అన్నారు. మూసీ నదీ పరివాహక ప్రాంత ప్రజలు అలాగే నగరంలో లోతట్టు ప్రాంత ప్రజలు వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, విద్యుత్ సమస్యలు, డ్రైనేజ్ సమస్యలు అలాగే ట్రాఫిక్ అంతరాయం ఏమైనా ఉంటే వెంటనే హెల్ప్ లైన్ నెం. 040 23202813, 7416687878 కాల్ చేయాలని అన్నారు.



ఛాదర్‌ఘాట్ మూసీ ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

అలాగే రెవిన్యూ, జిహెచ్ఎంసి, పోలీస్, హైడ్రా అధికారులు నిరంతరం పర్యవేక్షణ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామకృష్ణ, తాసిల్దార్లు సంధ్యారాణి, అన్వర్ హుస్సేన్, నయీముద్దీన్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**బూత్ స్థాయి నుంచి గెలిపించుకోవాలి**

పార్టీ శ్రేణులకు మంత్రులు పొన్నం, తుమ్మల, వివేక్ దిశా నిర్దేశం 3లో









నగరంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ బాలీవుడ్ నటి వామికా గబ్బి

# 'సంతాన సాఫల్యం' తుస్సే..

**కేంద్రాల నిర్వహణ గుట్టు రట్టు**

**నగరంలో సగానికిపైగా కేంద్రాలలో నిబంధనలకు నీళ్లు**

**వైద్య, ఆరోగ్య శాఖ వెలుగుచూస్తున్న దారుణాలు**

**త్వరలో ప్రభుత్వానికి నివేదిక నోటీసులు జారీకి కసరత్తు**



**హైదరాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త :** సికింద్రాబాద్‌లోని సృష్టి సరోగసీ కేంద్రం ఘరానా మోసం నేపథ్యంలో ప్రభుత్వం సంతాన సాఫల్య కేంద్రాల నిర్వహణ తీరుపై ప్రత్యేక దృష్టి సారించింది.

ఒక్క సంఘటనతో సంతాన సాఫల్య కేంద్రాలు అంటేనే దంపతులలో భయందోళనలు నెలకొన్నాయి. అన్ని నిబంధనలు పాటిస్తూ ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న కేంద్రాలను కూడా అనుమానించే విధంగా తయారైంది. ఐవీఎఫ్ అంటేనే భయాందోళనలు నెలకొంటున్నాయి. డబ్బే లక్ష్యంగా సంతానం కోసం వచ్చేవారిని ఏమార్చి లక్షలు కొల్లగొట్టడమే పనిగా పెట్టుకున్న సంతాన సాఫల్య కేంద్రాల నిగ్గు తేల్చడానికి వైద్య, ఆరోగ్య శాఖ కంకణం కట్టుకుంది. నగరంలో ఉన్న అత్యధిక సంతాన సాఫల్య కేంద్రాలు డబ్బు గడించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అలాంటి కేంద్రాలను పట్ల కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం సిద్ధ పడింది. ఇప్పటికే అలాంటి కేంద్రాలను ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. తెలంగాణా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సంతానం కోసం నగరానికి వేలాదిగా వస్తున్న దంపతుల పట్ల ఎక్కువ శాతం సంతాన సాఫల్య కేంద్రాలు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఐవీఎఫ్, సరోగసి చికిత్సలు జరిపే సంతాన సాఫల్య కేంద్రాలకు నోటీసులు చేసేందుకు చర్యలు చేపడుతోంది.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న దాదాపు 270 సంతాన సాఫల్య కేంద్రాలను ఇప్పటికే తనిఖీ జరిపినట్లు సమాచారం. నిబంధనలను పాటిస్తున్నది, లేనిది తనిఖీలో నిర్ధారణ చేసుకున్నారని తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 380 సంతాన సాఫల్య కేంద్రాలలో కూడా త్వరలోనే తనిఖీలు జరుపనున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలో ఉన్న నిబంధనలు పాటించని సంతాన సాఫల్య కేంద్రాలకు షోకాజ్ నోటీసులు జారి చేయడానికి ఏర్పాట్లను కూడా సన్నాహమవుతున్నారు. ఫెర్టిలిటీ మిగతా 3లో



ఆవిష్కరిస్తున్న సినీ దర్శకులు రేలంగి నరసింహ రావు

## కవితావిక సంపుటి ఆవిష్కరణ

**చిక్కడపల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త:** ప్రముఖ రచయిత తిరుమల వెంకట స్వామి రచించిన కవితావిక సంపుటిని ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహ రావు ఆవిష్కరించారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళలలిత కళా వేదికలో శుక్రవారం జరిగింది. నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ద్రావిడ విశ్వవిద్యాలయం(కుప్పం) పూర్వ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, నిర్వహణ సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బండారుపల్లి రామచంద్రరావు, రఘుశ్రీ, ఆకాశవాణి విశ్రాంత సహాయ సంచాలకులు సి.ఎస్.రాంబాబు, నిర్వాహక సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ లలితవాణి, కన్వీనర్ కోకా భవాని తదితరులు పాల్గొన్నారు. అంకితోత్సవం సభ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యం వహించింది.



బండారు దత్తాత్రేయను ఆహ్వానిస్తున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు

## గణేష్ ఉత్సవాలను సమన్వయంతో నిర్వహించండి

**చిక్కడపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంతవాతావరణం జరుపుకునేలా కృషి చేయాలని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. వచ్చే నెల 6న జరిగే సమూహిక గణేష్ నిమజ్జనంలో పాల్గొనవలసిందిగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు శుక్రవారం ఆయనను ఆహ్వానించారు. నూతన కమిటీ నేతృత్వంలో జరిగే ఉత్సవాలు అన్నివర్గాలకు, వివిధ ప్రభుత్వ శాఖలకు ఇబ్బందులు కలగకుండా పరస్పరం సహకరించుకుంటూ జరిగేలా చూడాలని దత్తాత్రేయ సూచించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు కరోడిమల్ అగర్వాల్ వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శి ఆలె భాస్కర్, బద్దం మహిపాల్ రెడ్డి, నాయిని బుచ్చి రెడ్డి, జి. ఆనంద్ గౌడ్, పూర్వ కార్పొరేటర్ వైకుంఠం, శ్రీరామ్ వ్యాస్‌తో పాటు ఇతర భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన సమితి సభ్యులను దత్తాత్రేయ ఘనంగా సత్కరించి అభినందించారు.



## భారీ వర్షానికి కూలిన ఇల్లు

**చిక్కడపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** రాంనగర్ రామాలయం వీధిలో సుక్క కృష్ణ (80)కి పురాతన ఇల్లు భారీ వర్షానికి శుక్రవారం కుప్పకూలింది. ఇది ఎప్పటినుంచో నప్రమాదభరింతంగా ఉండటంతో ఆయన ఇటీవల ఆ ఇంటిని ఖాళీ చేసి పక్కన వేరొకచోట అద్దెకు ఉంటున్నాడు. తన ఇల్లు కూలిపోవడంతో అందులో ఉన్న సామాగ్రి దెబ్బతిందని కృష్ణ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌తో సంప్రదింపులు జరిపి నిరాశ్రయులైన వారికి న్యాయం జరిగే విధంగా చూసానని పాశం సాయికృష్ణ యాదవ్ తెలిపారు.



మనీష్‌యాదవ్‌ను సత్కరిస్తున్న బండారు దత్తాత్రేయ

## మనీష్ యాదవ్ విజయం స్ఫూర్తిదాయకం

**చిక్కడపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** ప్రపంచంలోనే టాంజానియా దేశంలోని ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించిన యువ పర్వతారోహకుడు మాస్టర్ ఎ.మనీష్ యాదవ్ దేశానికి గర్వకారణంగా నిలిచారని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం మనీష్ యాదవ్‌ను దత్తాత్రేయ ఘనంగా సత్కరించారు. ప్రపంచంలోని ఎత్తైన స్వేచ్ఛా స్టాండింగ్ పర్వతం నుండి 5895 మీటర్ల ఎత్తున్న ఉహురు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన యువ పర్వతారోహకుడు మాస్టర్ ఎ. మనీష్ యాదవ్ అభినందనీయులు అని అన్నారు. మాస్టర్ మనీష్ యాదవ్ సాధించిన విజయం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. ఎంత ఎత్తులో ఉన్నా కలలు కనడం సాధ్యమేనని గుర్తు చేస్తూ, ఆయన తన ప్రయాణంలో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మరియు మరిన్ని అద్భుతమైన మైలురాళ్లను సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు.

**జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న బండారి వెంకటేష్ ముదిరాజ్.**

## ఘనంగా పండగ సాయన్న జయంతి

**మెహిదీపట్నం, ఆగస్టు 8, ప్రభాతవార్త :** పండుగ సాయన్న జయంతి వేడుకలను గుడిమల్కాపూర్ డివిజన్ లో ముదిరాజ్ సంఘం కార్వాన్ నియోజకవర్గ నాయకులు బండారి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్ ఇంచార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్, గుడిమల్కాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, టిడిపి రాష్ట్ర నాయకులు సురేందర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ నాగారం వేణు గౌడ్‌లు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు.



దరఖాస్తుల స్వీకరిస్తున్న దృశ్యం

## సిఎం ప్రజావాణిలో 199 దరఖాస్తులు

**బేగంపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త:** మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజా వాణి కార్యక్రమంలో మొత్తం 119 దరఖాస్తులు అందయి. వాటిలో గ్రామ పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 55, రెవెన్యూ శాఖకు సంబంధించి 19,మున్సిపల్ శాఖకకు 19, ప్రజా వాణికి 02, ఇందిరమ్మ ఇండ్ల కోసం 54 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 50 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజా వాణి ఇన్‌ఛార్జి,రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోలో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ఆలయాలకు శ్రావణ శుక్రవారం శోభ

### భారీగా తరలి వచ్చిన భక్తులు
### వైభవంగా వరలక్ష్మి వ్రతాలు

**సైఫాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మి వత్రం ఘనంగా జరిగింది. కృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది. మహిళలకు పసుపు, కుంకుమ, పసుపుతాడు, గజ్జులు, జాకెట్ ముక్క, పురుషులకు ఉత్తరీయం, శ్రీవారి లడ్డూ ప్రసాదం బహుకరించారు. ఈ కార్యక్రమాల్లో టిటిడి ఎఈవో యు.రమేష్, అధికారులు శ్రీనివాస మణికంఠ, లక్ష్మీపతి, శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందించారు.

**కంటోన్మెంట్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజక వర్గాల్లోని వివిధ దేవాలయాల్లో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పలు దేవాలయాలు భక్తులకు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా వరలక్ష్మి వ్రతాలు జరుపుకొని అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మొక్కులు తీర్చుకు న్నారు. ఈస్ట్ మారేడ్‌పల్లి వడ్డెర బస్తీలో దండుగుల శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరలక్ష్మి పూజా కార్యక్ర మాల్లో వైష్ణవి యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు.

**ఆకట్టుకున్న లక్ష్మీనాయణుల విగ్రహాలు**

**చార్మినార్:** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో శుక్రవారం అత్యంత వైభవంగా శ్రీ వరలక్ష్మి వ్రతం పూజలు జరిగాయి. మందిరంలో శ్రీ వరలక్ష్మి వ్రతం జరిగింది. పాతబస్తీతో పాటు జంట నగరాలలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. శుక్ర ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు చార్మినార్ అమ్మ వారిని దర్శించుకున్నారు. మందిరం వద్ద శ్రీ మహా విష్ణువు, లక్ష్మి దేవిల విగ్రహాలను ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు తరలి రావటంతో చార్మినార్ సరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.



శ్రీవరలక్ష్మి వత్రాన్ని నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు



చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన మహా విష్ణువు, లక్ష్మి దేవి విగ్రహాలు

**ఎల్.బి.నగర్ :** ఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం ప్రాంతం మొత్తం శ్రావణ శుక్రవారం సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది. బంగారు ధోవతిలో శ్రీమన్నారాయనుడు, బంగారు చీరలో ఆదిలక్ష్మి అమ్మవారు దర్శనమిచ్చారు.

**గాజుల అలంకారంలో దర్శనం ఇచ్చిన శ్రీ ఉజ్జయిని మహాకాళి**

**బేగంపేట,ఆగస్టు 8 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహాంకాళి అమ్మవారు శుక్రవారం గాజుల అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. 3వ శుక్రవారం సందర్భంగా శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారు మాణిక్యాల అమ్మవార్ల గాజుల అలంకరణలో దర్శనం ఇవ్వడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరివచ్చారు. శ్రావణ మాసం సందర్భంగా అలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ ఈఓ జి.మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం సమయంలో అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

**యూసుఫ్‌గూడ :** పలు బస్తీల కాలనీలలో మహిళలు ఎంతో పవిత్రంగా వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకున్నారు. ఉదయం నుంచే అమ్మవారి చిత్రపటాలను అలంకరించి అమ్మవారికి ఇష్టమైన గాజులు, గారెలు బూరెలు పండ్లు మిఠాయిలు నైవేద్యంగా సమర్పించారు. మహిళలకు పసుపు కుంకుమలను కానుకలుగా అందజేశారు. బిసి సెల్ అధ్యక్షులు నాగుల సత్యం ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.



ఎల్‌బినగర్‌లో అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



ఉజ్జయిని మహాకాళి అమ్మవారికి బోనం సమర్పిస్తున్న దృశ్యం

## ఓబిసి జాతీయ మహాసభకు తెలంగాణ బిసి ఉద్యోగులు

**రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో 300 మందిపైగా హాజరు**



సభకు హాజరై ఉద్యోగులతో చంద్రశేఖర్‌గౌడ్, రమా, రాధారాణి

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** గోవా రాష్ట్రంలోని గోవా యూనివర్సిటీ దగ్గర ఉన్న శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో జరిగిన పదవ అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ (రాష్ట్రీయ ఓబిసి మహాసంఘ్)సభకు తెలంగాణ బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, జనరల్ సెక్రటరీ రమల ఆధ్వర్యంలో సుమారు 300లకు పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా హైదరాబాద్‌నుంచి ప్రత్యేక బస్సుల్లో గోవాకు తరలివెళ్లారు. కాగా బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఓబిసిలమహాసభకు మహారాష్ట్ర సిఎం దేవేంద్ర పడ్నవీస్, గోవా సిఎం ప్రమోద్ సావన్, గోవా కాంగ్రెస్ ఇంచార్జ్ మాణిక్ మాణిక్‌రావు ఠాగూర్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఓబిసి ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఈమహాసభలో దేశవ్యాప్తంగా ఓబిసిల సమస్యలపై చర్చజరిగిందని తెలిపారు. అలాగే బిసిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను 4శాతానికి కుదించాలన్నారు. అంతేకాకుండా కేంద్రంలో ఓబిసిలకు ప్రత్యేక మంత్రి త్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కృష్ణ, ఆర్.శ్రీని వాసులు, మహబూబ్‌నగర్ టిజీవో అధ్యక్షులు విజయ్‌కుమార్, మహిళా బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాధారాణి, జ్ఞానేశ్వర్, మహేంద్ర, సాగర్ పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా మలయప్పస్వామి పవిత్రోత్సవాలు

**చిక్కడపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక పవిత్రోత్స వాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి ధాన్యాధివాసం, శయ్యాధి వాసము, పుష్పాది వాసము, మూర్తి కుంభవాహన, పవిత్రమూర్తి హోమం వంటి పవిత్ర పూజా కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. శనివారం పూర్ణాముతి, 41 కలశాలతో అభిషేకం, తిరుమంజనము, మహానైవేద్యం, మంత్రపుష్పం, పవిత్ర ప్రదానం అనంతరం చందనగోష్టి, వేదపండితులకు సన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

## అక్రమ కేసులను వెంటనే కొట్టివేయాలి

**చిక్కడపల్లి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే కొట్టివేయాలని వక్తలు హెచ్చరించారు. శుక్రవారం చిక్కడపల్లిలో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ అధినేత తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కల్లెపు చంద్రన్న ప్రసాద్, ఎ.యాదగిరి, కరీంనగర్ పూర్వ చైర్మన్ ఎం.వెంకట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రఫుల్‌రాంరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే అన్నిజిల్లాలకు జేఏసీని విస్తరింపచేస్తామని, జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

## ముగిసిన తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సభలు

**చిక్కడపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వం గురించి పరిశోధన అధ్యయనం కోసం ప్రభుత్వం తెలంగాణ హిస్టారికల్ రీసెర్చ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య బాల భాస్కర్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం విద్యానగర్‌లో వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాల ముగింపు సభ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు అధ్యక్షతన జరిగింది.

## బిసి బిల్లుకు మద్దతు తెలపాలి: అంజన్‌కుమార్‌యాదవ్

**అఫ్జల్‌గంజ్, ఆగస్టు 8ప్రభాతవార్త:** సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను మాజీ ఎంపి, టిపిసిసి వర్కింగ్ అధ్య క్షులు అంజన్‌కుమార్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాలలో బి.సి బిల్లుపై చర్చించే విధంగా చూడాలని కోరారు.

## తన్మయుల్ని చేసిన నృత్యవిన్యాసం

**రవీంద్రభారతి, ఆగస్టు 8 ప్రభాతవార్త :** జాతీయ అంతర్జాతీయ నృత్యకారిణుల నృత్య విన్యాసాల నృత్యాంగణ ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది. రవీంద్రభారతిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, సింగిడి సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యం వహించాయి. అంతర్జాతీయస్థాయిలో నృత్యాంగణ శీర్షికన నిర్వహిస్తున్న 3వ విభాగంలో కెనడాకు చెందిన మేరీ ఎలాంగోవన్, హాంకాంగ్‌కు చెందిన రూపకిరణ్, దుబాయ్‌కి చెందిన శ్రీప్రణవి చింతలపూడి, కోల్‌కతా నుండి యాజ్ఞనేని సర్కార్ ఒడిస్సీ-మణిపూరి; ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మైథిలి పలు నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు పటేల్ రమేష్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు ఆచార్య సూర్యధనుంజయ్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, ఇండియన్ అసోసియేషన్ కార్యదర్శి వేదాంతం కిరణ్, సింగిడి సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు సుందర ఉపాసన, జాతీయ అధ్యక్షుడు విశ్వకర్మ డి.ఆర్.కె. దుబాయ్, ఇటలీకు చెందిన కిషోర్ యాదవ్‌లు ప్రముఖ నర్తకీమణులు మేరి ఇలాంగోవన్, ఇందిర పరాశరం, రూపకిరణ్ లను సత్కరించి పురస్కారాలను ప్రదానం చేశారు.



నృత్యవిన్యాసాల నృత్యాంగణలో ఓ దృశ్యం



కళాకారిణులను సత్కరిస్తున్న రమేష్‌రెడ్డి, సూర్యధనుంజయ్, విశ్వకర్మ డిఆర్‌కె కిరణ్

## డైలీవేజ్ వర్కర్లను ఆదుకోకపోతే ఈనెలలోనే సమ్మెబాట

**ముషీరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** డైలీ వేజ్ వర్కర్లకు న్యాయం చేయనిపక్షంలో ఈనెలలో ఎప్పుడైనా సమ్మెకు దిగే అవకాశం ఉందని తెలంగాణ గిరిజన హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాడె పాపారావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన కవాడిగూడలో విలేకరులతో మాట్లాడుతూ జీవో 64 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కేవలం రూ.11వేలు మాత్రమే వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరునెలలుగా వేతనాలు లేక, డైలీవేజ్ వర్కర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లా కలెక్టర్ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబాలకు పదిలక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. ఆ కుటుంబంలో ఒకరికి టైం స్కేల్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అక్కను వేధిస్తున్నాడని బావను రైలు కిందకు తోసి హత్య

**హైదరాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త :** మద్యం మత్తులో అక్కను వేధిస్తున్నాడని బావను రైలు కిందకు తోసేసి హత్య చేసిన ఘటన మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్లో సికింద్రాబాద్ రైల్వే డిఎస్‌పి జావెద్ కథనం ప్రకారం.. పాత మలక్‌పేటకు చెందిన సిరాజ్(29) యాక్కుత్పురకు చెందిన సానియా(23)ను నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకుని అత్తారింటో ఉంటున్నాడు. మద్యం తాగి తరచూ భార్యను కొట్టేవాడు. ఈ నెల 2న ఓల్డ్ మలక్‌పేటలోని తమ ఇంటికి సిరాజ్ దంపతులు వచ్చారు. అక్కడ వారిద్దరూ మరోసారి గొడవపడ్డారు. అనంతరం బావ కొడుతున్నాడంటూ తన తమ్ముడు సయ్యద్ జమీర్(21)కు సానియా ఫోన్ చేసింది. స్నేహితుడైన ఎండీ జునైద్(23)తో కలిసి రాత్రి అక్కడికి జమీర్ చేరుకున్నాడు. అర్ధరాత్రి ఇద్దరూ సిరాజ్ను బైక్‌పై మలక్‌పేట రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ బావ, బావమరిది మధ్య ఘర్షణ జరిగింది. ఆగ్రహించిన జమీర్.. సిరాజ్‌ను అటుగా వెళ్తున్న రైలు కిందకు తోసేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్టేషన్ ప్రాంగణంలోని నిఘా కెమెరాలతో సయ్యద్ జమీర్, అతనికి సహకరించిన జునైద్ను గురువారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## నర్సింగ్ సిబ్బంది పోరాటాలకు సిద్ధం కావాలి

**సైఫాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది అవినీతి, అక్రమం, అధర్మం లేని న్యాయబద్ధమైన పదోన్నతులు సాధించుకోవడానికి సిద్ధం కావాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చింది. కేటగిరి వారికి ప్రస్తుతం ఉన్న డిజిగ్నేషన్ మార్పు చేయాలని, నర్సింగ్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను సాధించేంతవరకు పోరాటం కొనసాగించాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం యూనియన్ కార్య నిర్వాహక అధ్యక్షుడు వి.వేణు కుమార్, నగర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసమూర్తి, ఉపాధ్యక్షుడు ఎంసిఎస్ రాజు వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన స్టాఫ్ నర్సులకు హెడ్ నర్సులుగా సకాలంలో పదోన్నతులు కల్పించాలని, వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చాలని, ఇతర ప్రభుత్వ శాఖల్లో మాదిరిగానే నర్సింగ్ సిబ్బంది డిజిగ్నేషన్ మార్పు చేయాలని డిమాండ్ చేశారు.



వినతి పత్రాన్ని ప్రదర్శిస్తున్న యూనియన్ నాయకులు

## మహిళలు కాన్ఫిడెంట్‌గా ఉంటే ఏదైనా సాధించవచ్చు

**-బాలీవుడ్ నటి వామికా గబ్బి**

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మహిళలు కాన్ఫిడెంట్‌గా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలుగుతారని బాలీవుడ్ తార వామికా గబ్బి అన్నారు. బంజారామిల్స్‌లోని తాజ్ దక్కన్‌లో ఆమె శుక్రవారం మిస్ ఇండియా యూకే ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా వామికా తాను నటించిన తెలుగు నటుల్లో అడవి శేష్ మంచి నటుడని, తనతో నటించడంతో ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు స్టార్ డస్ట్ పేజెంట్స్ ప్రతినిధులు సత్య, క్రాంతి, సాయి మాట్లాడుతూ దక్షి ణ భారతదేశంలోని సాంస్కతిక వారసత్వాన్ని, ప్రతిభను, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు మిస్ ఇండియా యూకే ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏడాది పొడుగునా సాగుతుందని ఇందులో భాగంగా తొలుత మిస్ తెలుగు యూకే, మిస్ తమిళ యూకే, మిస్ కన్నడ యూకే, మిస్ మలయాళం యూకే పోటీలు నిర్వహించబడతాయి అని అన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు నగదు బహుమతులతో పాటు, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని వారు తెలిపారు. త్వరలోనే ఈ మిస్ ఇండియా యూకే ప్రాజెక్ట్ రిజిస్ట్రేషన్ తో పాటు ప్రమోషన్ వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ పేజెంట్ లో అందాల పోటీలే కాకుండా దక్షి ణ భారతీయుల సాంప్రదాయాలను ప్రపంచ వేదికకు పరిచయం చేసేందుకు ఈ సరికొత్త కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు.

## బస్తీ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 8, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్ బస్తీలో బస్తీ వాసులకు ఇంటి స్థలాలకు ప్రభుత్వం ప్రత్యేక జీవోను జారీ చేసి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మికనగర్ బస్తీ సర్వే నంబర్ 128/1 దాదాపు 37 ఎకరాల స్థలంలో దాదాపు 30 సంవత్సరాల నుంచి ఉంటున్నారు. 31.7.1991వ సంవత్సరంలో మాజీ మంత్రి దివంగత పి.జనార్ధన్‌రెడ్డి కళ్యాణ్‌నగర్ సొసైటీలో గజం రూ. 25లాగా ఇక్కడ ప్రజలకు అగ్రిమెంట్ చేయించారు. అయితే దాదాపు 200 మంది బ్యాంకుల్లో డబ్బు కూడా జమ చేశారు. అయితే ఎమ్ఐఎమ్ పార్టీకి సంబంధించిన వారు సమావేశాలు ఏర్పాటు చేసి ఈ అగ్రిమెంట్‌ను చెడగొట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 18.06.2021లో కళ్యాణ్‌నగర్ సొసైటీ వారికి అనుకూలంగా తీర్పు రావడంతో 2013 భూసేకరణ చట్టం కింద నష్టపరిహారం చెల్లించాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శిని హైకోర్టు ఆదేశించటం జరిగింది. దీంతో ప్రభుత్వం ఇక్కడ నివసిస్తున్న కార్మికనగర్ స్థలం 37 ఎకరాల స్థలాన్ని బస్తీవాసులకు రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం జీవో జారీ చేస్తే రిజిస్ట్రేషన్ అవుతుంది. లేకపోయినా కనీసం

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**కంటోన్మెంట్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని 66 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి తహాశీల్దార్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఒడి బియ్యంతో అన్నదానం

**కంటోన్మెంట్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** ఆషాడమాసం, బోనాల జాతరను పురస్కరించుకొని కంటోన్మెంట్ బాపూజీ నగర్‌లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యంతో ఆలయ కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు శంకర్, ప్రేమ్ ముదిరాజ్, నర్సింహ్మా, రామారావ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

**అడ్డగుట్ట, ఆగస్టు 8 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. మోండా డివిజ్‌లోని శివాజీ నగర్ చాపల బజార్, రెజిమెంటల్ బజార్, మారేడ్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు జి.తూగుప్త, ప్రశాంత్, గణేష్,రాహుల్,నర్సింగ్, విశాల్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

## పేద కుటుంబాలకు అండ సిఎం రిలీఫ్ ఫండ్

**ముషీరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** పేద కుటుంబాలకు అండ సీఎం రిలీఫ్ ఫండ్ పథకమని అంబర్‌పేట్ ఎమ్మెల్యేక కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్నాక డివిజన్‌లో కార్పొరేటర్ విజయ కుమార్‌గౌడ్‌తో కలసి అర్హులైన 18 మంది లబ్ధిదారులకు 5.92 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇంత జరుగుతున్నా బిసిలు నోరుమెదపరేం?

**మెహిదీపట్నం, ఆగస్టు 08, ప్రభాతవార్త :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ దొంగనాటకాలు ఆడుతుందని బిజెపి గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్ పూర్తిగా బీసీలకు అమలు చేస్తే బిజెపి తప్పకుండా మద్దతు ఇస్తుందని తెలిపారు. జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఉమా మహేందర్ పాల్గొని మాట్లాడారు. బిసిలను అడ్డం పెట్టుకొని 42 శాతం రిజర్వేషన్ లో 10 రిజర్వేషన్ ముస్లింలకు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. బిసిలకు ఇంత అన్యాయం జరుగుతుంటే బిసి సంఘాల నేతలు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. సమావేశంలో బిజెపి ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్ రావు నాయకులు చెరుకుల ఉదయ్ కుమార్, రాజేందర్ డిగాన్, మనీష్‌లు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు 15న నగదు పురస్కారం

**మెహిదీపట్నం, ఆగస్టు 8, ప్రభాతవార్త :** రక్షాబంధన్ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 15న ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు కార్వాన్ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఉత్తర పల్లి కృష్ణ తెలిపారు. కార్వాన్ మార్కండేయ భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సామూహిక శ్రావణ ఉపాకర్మ గాయత్రి ధారణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గంజి రఘునాథ్, గోపాల్, శ్రీనివాస్, శ్రీశైలం, లక్ష్మీనారాయణ, నరేందర్, సుదర్శన్ పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న యువతికి అండగా నిలిచిన హెడ్‌కానిస్టేబుల్

**పంజగుట్ట, ఆగస్టు 8 (ప్రభాతవార్త) :** బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ పబ్లిక్ స్కూల్ సమీపంలో ఓ కానిస్టేబుల్ మానవత్వాన్ని చాటుకున్న ఉదంతం ప్రశంసలు కురిపిస్తోంది. వివరాల్లోకి వెళితే.. గురువారం రాత్రి ఓ యువతి అక్కడ బస్సు కోసం నిరీక్షిస్తోంది. ఆసమయంలో భారీ వర్షం పడుతుండటంతో బస్సులు రాకపోవడంతో కనీసం నడిచి అయినా బయటపడదామని ప్రయత్నించింది. అప్పటికే మోకాలుపైగా నీళ్ల చేరి జలాశయంగా మారడంతో ఆందోళన చెంది ఏం చేయాలో దిక్కుతోచక విలపిస్తూ అక్కడే నిలబడింది. విధి నిర్వహణలో వేరే పనిమీద వెళుతున్న సీఎఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్ వర్మ ఈ విషయం గమనించారు. వెంటనే ఆమెను పోలీస్ జీప్ లో సురక్షితంగా ఇంటి వద్ద దింపారు. ఆపదలో ఉన్న యువతికి చేయూత నిచ్చిన శ్రీధర్ వర్మను పలువురు అభినందిస్తున్నారు.

## నేడు మార్కండేయ మహాముని రథయాత్ర

**చార్మినార్,ఆగస్టు 8 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ హుస్సేనీ ఆలంలో ఈ నెల 9వ తేదీన శ్రీ మార్కండేయ బాల భక్త సమాజం ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ మహాముని శివలింగ (రథయాత్ర) ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్, మార్కండేయ బాల భక్త సమాజ్ ప్రతినిధులు శంకర్, పులిపాటి ప్రభాకర్, దుర్గేష్ కుమార్ తెలిపారు. సిప్లిగంజ్‌తో పాటు పలు ప్రాంతాలలో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని చెప్పారు.

## సేవా భావం ఎంతో ఆత్మతృప్తిని ఇస్తుంది

**సైఫాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** సేవా కార్యక్రమాలతో మనిషికి ఎంతో ఆత్మసంతృప్తిని కలిగిస్తుందని, ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగియుండాలని అగర్వాల్ సేవా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిరుధ్ అగర్వాల్ కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో జరిగిన రాదే రాధే గ్రూప్ హైదరాబాద్ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రాధే రాధే గ్రూప్‌కు చెందిన ప్రముఖులు సతీష్‌గుప్తా, జగత్‌నారాయణ్ అగర్వాల్, రామ్ ప్రకాష్ అగర్వాల్, మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ నేను కాదు మనం అనే భావనే రాధే రాధే గ్రూప్ స్ఫూర్తి అని చెప్పారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం పెద్ద ఎత్తున కొనసాగింది.

## సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలో ముమ్మర ప్రచారం

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 8, ప్రభాతవార్త :** ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే బస్తీ ఎన్నికల్లో భాగంగా వి రామారావునగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఈ నెల 10వ తేది ఆదివారం జరుగనున్నాయి. ఇందుకు గాను నలుగురు పోటీలో ఉండగా అధ్యక్ష పోటీలో ఉన్న బండా యాదగిరి తన అనుచరులతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు నర్సింహ, అనుచరుడైన యాదగిరి హనుమాన్, శివాలయం దేవాలయాలకు ప్రధాన కార్యదర్శిగా ఉంటూ బస్తీలో బస్తీ వాసులకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు మద్దతు ఇవ్వాలంటూ ఇంటింటికి వెళ్ళి యాదగిరికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఈనెల 10వ తారీఖున జరిగే సంక్షేమ సంఘం అధ్యక్షులు సూర్యుని గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

## ఆశల ఉచ్చు

(మొదటి పేజీ తరువాయి)

చిక్కుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు రాక ఎంతోమంది ఉపాధి అవకాశాలు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో నిరుద్యోగులు, గృహిణుల ఆశలే పెట్టుబడిగా సైబర్ నేరగాళ్ల రెచ్చిపోతున్నారు. పార్ట్ టైం ఉద్యోగాలతో డబ్బు సంపాదించుకోవచ్చని నేరగాళ్ల చెబుతున్న మాయమాటలను నమ్మి నిరుద్యోగులు మోసపోతున్నారు. ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో శోధించేవారిని లక్ష్యంగా చేసుకుంటున్న నిందితులు వారిని బురిడీ కొట్టిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. పార్ట్ టైం ఉద్యోగాలంటూ వాట్సప్, టెలిగ్రామ్‌లకు సందేశాలు పంపుతూ ఉచ్చులోకి దించి కుచ్చుటోపీ పెడుతున్నారు.

**ఈజీ టాస్కులతో వల..**

పార్ట్ టైం ఉద్యోగాలంటూ ఆన్‌లైన్‌లో, వాట్సప్, టెలిగ్రామ్‌లలో సందేశాలు పంపుతున్న సైబర్ నేరగాళ్ల అమాయకులను వంచించేందుకు ఈజీ టాస్కులు ఇస్తూ ఆకర్షిస్తున్నారు. సులభంగా ఉండే ప్రశ్నలు, గుర్తించగలిగే బొమ్మలు, ప్రాంతాల వివరాలు, వీడియోలు పంపుతూ వాటిని చూస్తూ తేలికగా సమాధానాలు చెప్పే అంశాలు, ప్రశ్న, అందుకు నాలుగు సమాధానాలు ఇచ్చి పూర్తి చేయమంటున్నారు. వారి మాయలో పడుతున్న బాధితులు టాస్కులను తేలికగా పూర్తి చేస్తున్నారు. దీంతో వెంటనే రూ. 200 నుంచి రూ. 400 వరకు నగదును సైబర్ నేరగాళ్ల వారికి బదిలీ చేస్తున్నారు. దీంతో ఇదంతా నిజమేనని నమ్మిన బాధితులు వారు చెప్పిన ఖాతాలకు రూ.వేలల్లో బదిలీ చేసి నిండా మునుగుతున్నారు.

**తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దు : శివ మారుతి (సైబర్ క్రైమ్ ఏసీపీ)**

సెల్‌ఫోన్లకు వచ్చే సంబంధం(తెలియని) లేని లింక్‌లను క్లిక్ చేయవద్దని సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి తెలిపారు. ఒకవేళ క్లిక్ చేస్తే తమ ఫోన్‌లో ఉన్న సమాచారం మొత్తం సైబర్ నేరగాళ్లకు చేరుతుంది. దీంతో నిందితులు ఫోన్లు చేసి తమ మాయమాటలతో డబ్బు ఆశ చూపి ఖాతాలు ఖాళీ చేస్తారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని డబ్బు పోగొట్టుకున్న బాధితులు 24 గంటల్లో 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే అగంతకుల ఖాతాలను స్తంభింపజేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## నాలాలపై నిరంతర పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే జీహెచ్‌ఎంసి హెల్ప్‌లైన్ 040-21111111కి తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ పర్యటనలో ఈ ఈ లాల్ సింగ్, డీసీ సైఫుల్లా, ఏఎంఒహెచ్ ఇర్షాద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

**జీహెచ్‌ఎంసి కంట్రోల్ రూమ్ ఆకస్మిక తనిఖీ..**

జీహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శుక్రవారం సందర్శించారు. వర్షాల నేపథ్యంలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఓఎస్‌డీ అనురాధను ప్రశ్నించారు. వర్ష సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడంతో పాటు, ఫీల్డ్ టీంలకు త్వరగా తెలియజేయాలనీ కమిషనర్ ఆదేశించారు. రియల్‌టైమ్ మానిటరింగ్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## మునక చెరువు మునకకు కారణమేంటి?

(మొదటి పేజీ తరువాయి)

తగ్గుముఖం పట్టినప్పుడు వెంటనే ఈ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. చెరువు పరిసరాల్లో రహదారులే కాకుండా.. నివాసాలు కూడా నీట మునుగుతున్నాయని.. వెంటనే ఈ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. చెరువులోకి వచ్చిన ఇన్‌లెట్ సామర్థ్యంతో పాటు.. ఔట్‌లెట్ కూడా పరిశీలించారు. మల్కం చెరువు చుట్టూ వరద నిలవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. బయోడైవర్సిటీ పార్కు పరిసారలతో పాటు షేక్‌పేట్ ప్రాంతాల నుంచి కూడా భారీ వరద వచ్చి వంతెన ఆరంభంలో నిలిచిపోతోందని.. ఈ వరదంతా మల్కం చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలన్నారు. హైడ్రా కమిషనర్‌తోపాటు అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావు భూపాల్ తదితరులు ఉన్నారు.

## 'సంతాన సాఫల్యం' తుస్సే

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం సంఘటనతో నమ్మశక్యం కాని అనేక విషయాలను వైద్య ఆరోగ్య శాఖ గుర్తించినట్లు సమాచారం. దీంతో గ్రేటర్ పరిధిలోని కేంద్రాలపై అత్యవసరంగా తనిఖీలు జరిపిన అనంతరం రాష్ట్రంలోని ఇతర కేంద్రాలలో కూడా విస్తృత తనిఖీలు జరపాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ముందుగా దాదాపు 35 తనిఖీ బృందాలు తనిఖీలను జరిపాయి. ఈ బృందాలు కేంద్రాలలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అనేక అంశాలను గుర్తించాయి. ఇందుకు అనుగుణంగా ఆయా కేంద్రాలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడానికి రెడీ అవుతున్నాయి.

**వెలుగులోకి నమ్మలేని నిజాలు....**

ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ సంతాన సాఫల్య కేంద్రాలలో చేపట్టిన తనిఖీల్లో నమ్మలేని అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. నగరంలో ఉన్న దాదాపు 270 సంతాన సాఫల్య కేంద్రాలో అధికారులు అత్యవసరంగా తనిఖీలు జరుపగా అందులో అధిక శాతం కేంద్రాలు అసలు నిబంధనలు పాటించడం లేదని అధికారులు గుర్తించారు. తనిఖీలలో వెలువడ్డ విషయాలను ఇప్పటికే ఆరోగ్య శాఖలకు తనిఖీ బృందాలు రిపోర్టులను కూడా అందజేసినట్లు సమాచారం. తమ, తమ సంతాన సాఫల్య కేంద్రాలలో చూపించిన డాక్టర్లు, ఇతర సిబ్బందికి, అధికారులు గుర్తించిన డాక్టర్లు, ఇతర సిబ్బంది రికార్డులకు ఏమాత్రం పొంతన లేదని గుర్తించారు. ఉండాల్సిన వైద్యుల సంఖ్య, ఇతర స్టాఫ్ సరిపడా, అర్హతలేని సిబ్బందిని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే కేంద్రాలలోని రికార్డులలో చూపించిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాల విషయంలో కూడా తప్పుడు సమాచారం ఇచ్చినట్లుగా గుర్తించారు. రిజిస్ట్రేషన్ సమయంలో రెండు యంత్రాలను చూపించగా, తనిఖీ సమయంలో నాలుగున్నట్లు గుర్తించారు. తనిఖీలు జరిపిన కేంద్రాల వివరాలను, వాటిల్లో జరుగుతున్న అక్రమాలను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అతి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఇప్పటికే ఉన్నత స్థాయి అధికారులు సమీక్షించారు. నివేదికలు అందజేసిన అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా కేంద్రాలపై తగిన చర్యలు తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తరచుగా ఆయా కేంద్రాలను పరిశీలించడం, లేదా తనిఖీలు జరిపి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి అక్రమాలు జరిగినట్లుగా కూడా అధికారులు భావిస్తున్నారు. పర్యవేక్షించే అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్దయెత్తున అక్రమాలు జరుగడం విడ్డురంగా ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆయా కేంద్రాలపై మాత్రమే చర్యలు ఉంటాయా, లేక పర్యవేక్షించాల్సిన అధికారులపై కూడా చర్యలు ఉంటాయా అనేది వైద్య, ఆరోగ్యశాఖ అందించే నివేదికలపై ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది.

## వరాల తల్లీ..కల్పవల్లీ

(మొదటి పేజీ తరువాయి)

కనిపించాయి. భక్తులు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగ్యలక్ష్మి ఆలయం, వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయం, శ్రీశృంగేరి శారదాంబ, బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి తదితర ఆలయాలల్లో అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో క్యూకట్టారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

**కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సునీత**

**హైదరాబాద్, ఆగస్టు 8 (ప్రభాతవార్త):** : కార్మిక శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి పాసైనవారికి ఉద్యోగ అవకాశాల కోసం శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆ శాఖ జాయింట్ కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ జాసన్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందితే ప్రపంచంలో ఏ మూలనైనా ఉద్యోగం చేయగల నైపుణ్యాలను సొంతం చేసుకోవచ్చునని అన్నారు. నైపుణ్యం కోసం విదేశాలకు వెళ్ళవలసిన అవసరం లేదన్నారు. ఆసక్తి ఉన్న వారు పదవ తరగతి మెమో, ఆధార్ కార్డు, బోనఫైడ్, కులద్రీకరణ పత్రాలు తీసుకొని ఈనెల ఆగస్టు 28వ తారీకు లోపల దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

# బూత్ స్థాయి నుంచి గెలిపించుకోవాలి

**పార్టీ శ్రేణులకు మంత్రులు పొన్నం, తుమ్మల, వివేక్ పిలుపు**



బూత్ కమిటి సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ మంత్రులు పొన్నం, తుమ్మల, వివేక్

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 8, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ బూత్ కమిటి సమావేశం స్థానిక కార్పొరేటర్ జీహెచ్‌ఎమ్‌సి స్టాండింగ్ కమిటి సభ్యులు సిఎన్‌రెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధులుగా హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామిలతో పాటు వివిధ కమిటీల చైర్మన్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానికులు స్థానికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళ్ళారు. ఈసందర్భంగా హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనునిత్యం ప్రజా సమస్యల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెల్లరేషన్ కార్డులు, సన్న భియ్యం, 2వందల యూనిట్ల ఉచిత కరెంటు, ప్రతి నియోజక వర్గానికి 3500ల ఇందిరమ్మ ఇళ్ళు అందివ్వడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుచుకునేందుకు అవసరమయ్యే విధంగా నిధులు కేటాయించి పనులు చేపడతామన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్‌కు గట్టిపట్టు ఉందని దివంగత ఎమ్మెల్యే పి.జనార్ధన్‌రెడ్డి ఈ ప్రాంత పేద ప్రజల కోసం అనునిత్యం అసెంబ్లీలో గొడవలు పడేవారని పేదలకు ఇళ్ళ పట్టాలు, మంచినీటి సమస్యలపై కృషిచేశారని ఆయన సేవలను గుర్తు చేశారు.

గత ప్రభుత్వం కోట్ల రూపాయలు అప్పు చేస్తే ప్రస్తుతం వాటికి వడ్డీలు చెల్లుస్తూ అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ రోడ్డు డవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మాల్‌రెడ్డి రామ్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వేణు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మోహన్‌రెడ్డితో పాటు వివిధ బూతుల నాయకుల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వానికి ఏజెంటుగా ఎన్నికల కమిషన్



బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను వ్యతిరేకిస్తూ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు ర్యాలి నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** మోడీ ప్రభుత్వానికి ఏజెంటుగా ఎన్నికల కమిషన్ (ఈసీ) పనిచేస్తున్నదని సీపీఎం కేంద్ర కమిటి సభ్యులు ఎస్ వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను వ్యతిరేకిస్తూ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం జరిగిన నిరసన సభలో వీరయ్య మాట్లాడుతూ బీహార్లో అక్రమంగా, అప్రజాస్వామికంగా 62లక్షల ఓటర్లను రకరకాల పేరుతో తొలగించే ప్రక్రియకు ఈసీ ఒడిగట్టిందని విమర్శించారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(సర్) పేరుతో ఒక్క నెలలోనే ఇన్ని ఓట్లను తొలగించిందని తెలిపారు. నిరుపేదలు, అసంఘటిత కార్మికులు, గ్రామీణ పేదలను ఓటర్ల లిస్టులో నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి ఓట్లు పడవని భావించిన ప్రతీ చోటా ఏదో ఒక పేరుతో వాళ్ల ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఇది అప్రజాస్వామిక చర్య అనీ, అందుకే సీపీఐ(ఎం) దీన్ని వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ప్రతి పక్ష పార్టీలన్నీ కూడా వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. అయినా మోడీ ప్రభుత్వానికి ఏజెంటుగా వ్యవహరిస్తూ, ఊడిగం చేస్తున్న ఈసీ ఉలుకూ పలుకు లేకుండా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇదోక కుట్ర పూరితమైన ప్రక్రియ అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉండాల్సిన మోడీ.. ప్రధాన మంత్రి స్థానంలో ఉన్నారనే విషయాన్ని అనేక ఆధారాలు బట్టబయలు చేస్తున్నాయని వివరించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఈసీ బీజేపీకి తొత్తుగా మారటం వల్ల, మోడీకి ఏజెంటుగా వ్యవహరించటం వల్ల ఐదు కోట్ల ఓట్లు పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు అదనంగా ఉన్నాయని తెలిపారు. ఇది ఎన్నికల కమిషన్ ప్రకటించిన లెక్కేనని గుర్తు చేశారు. బీజేపీ అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలిస్తే దేశంలో ఒక భయానక పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని కేవలం బీహార్కు సంబంధించిన విషయంగానే చూడొద్దని సూచించారు. రానున్న కాలం గడ్డు కాలంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలకు, ప్రజాస్వామిక వాదులపైనా ఉందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం వెంకటేశ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్రావు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, రాష్ట్రకమిటీ సభ్యులు ఎంవీ రమణ, పి.ఆశయ్య, భూపాల్, బాబూరావు, నగర నాయకులు ఎం శ్రీనివాస్, ఎం శ్రీనివాస్ రావు, మహేందర్, ఎం. దశరథ్, ఆర్ వెంకటేశ్, రంగారెడ్డి జిల్లా నాయకులు చంద్రమోహన్, కవిత, జగదీశ్ తదితరులు పాల్గన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న త్రినాథరావు, కళావిఎస్.జనార్ధనమూర్తి తదితరులు

## జంధ్యాల ప్రతి కవితా కరుణ రసమే

**చిక్కడపల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త:** జంధ్యాల పాపయ్యశాస్త్రి ప్రతి కవితా కరుణ రస ప్రధానమేనని కరుణశ్రీగా అయన సార్థక నామధేయుడు అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ ఉన్నతాధికారి ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాధరావు అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంతరావు కళావేదికలో ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమ పరంపరలో భాగంగా గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జంధ్యాల పాపయ్య యాదిలో సమావేశం జరిగింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో గానసభ సభ్యుడు శంకర ప్రసాద్, ప్రముఖ వ్యాఖ్యాత పిఎంకె గాంధీ, గాయని మంగరాజు రుక్మిణి, జి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలి

**-మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్**

**చిక్కడపల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వెనుకబడిన కులాల వారికి సిఎం రేవంత్ రెడ్డి 42శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షనీయమని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ వివరించారు. ప్రధానమంత్రి వెంటనే స్పందించి రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జరిగే విధంగా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, 75 సంవత్సరాల స్వాతంత్ర కాలంలో దేశ ఆర్థిక అభివృద్ధికి ఉత్పాదక శక్తులుగా బీసీ కులాల వారు కృషి చేశారని, ఈ వర్గాలు అన్ని రంగాలలో అభివృద్ధి చేయుటకు మెజారిటీ బీసీ కులాల కృషిని కేంద్ర ప్రభుత్వం మరవరాదని, వారి వెనుకబడుతనాన్ని గుర్తించి బీసీ కులాలను విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాలలో అభివృద్ధిలోకి తీసుకురావడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయించాలి

**బేగంబజార్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** వర్షాకాలం నేపథ్యంలో అన్ని వేళ్లాలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ కోరారు. ఈమేరకు టి.జి.ఎస్.పి. డి.ఎస్.సి.ఎల్ డైరెక్టర్ ఎన్.నరసింహులును మర్యాద పూర్వంకగా కలిసి వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి కుండ పోతగా కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరాకు సుమారు రెండు మూడు గంటల అంతరాయం ఏర్పడిందన్నారు. అంతే కాకుండా కంచలేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు మూలంగా విద్యుత్ ప్రమాదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. కంచెలేని ట్రాన్స్ ఫార్మర్ల చుట్టు కంచె ఏర్పాటు చేయించాల్సిన అవసరం భాద్యత ఎంతైనా ఉందన్నారు. జాంబాగ్ డివిజన్‌లోని ఓంనగర్, తోఫ్‌ఖానా మజీద్ సమీపంలో ఉన్న పార్క్ వద్ద ఉన్న ట్రాన్స్ ఫార్మర్లకు కంచెలేవన్నారు. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు వంగి ఉన్నట్లు తెలిపారు. కాగా ఎస్.డి.నగర్‌లో పురాతనమైన ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకుని వెంటనే నాంపల్లి తహసిల్దార్ నయిముద్దీన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన విచారణ నిమిత్తం సిబ్బందిని పరిశీలించాలని చెప్పినట్లు చెప్పారు. నివేదిక తయారు చేసిఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఈకార్యక్రమంలోఎస్.డి నగర్ బస్తీకమిటి అధ్యక్షులు ఏర్పుల విజయ్ కుమార్, నాయకులు భాను, నరేష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్ మృతి పట్ల సంతాపం

**చిక్కడపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** కేంద్ర సమాచారమంత్రిత్వ శాఖ పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ పీజె. సుధాకర్ మృతి పట్ల హర్యానా పూర్వ బం దారు దత్తాత్రేయ ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని సంతా పాన్ని తెలిపారు.


కోఠి ఇఎన్‌టి ఆసుపత్రి రహదారిపై నిల్చిఉన్న వర్షం నీరు

## తేరుకోని గోషామహల్

**వర్షానికి జలమయంగా మారిన రహదారులు**

**గోషామహల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** మహానగరంలో నిన్న కురిసిన వర్షానికి రహదారులు పూర్తిగా జలమయంగా మారాయి. ఒకసారిగా వాతావరణం మారిపోయింది. నిన్న సాయంత్రం వాతావరణంలో మార్పు వచ్చి అకస్మాత్తుగా దంచి కొట్టిన వర్షానికి దీంతో అబిడ్స్, నాంపల్లి, కోఠి, ఇఎన్‌టి ఆసుపత్రి రహదారి, పుత్లీబౌలి, రంగమహల్‌చౌరస్తా, ఎంజెమార్కెట్ సుల్తాన్‌బజార్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్ తదితర ప్రాంతాలల్లో వర్షం నీరు వరద ప్రవాహం కనిపించింది. పలు ప్రాంతాలల్లో ఈదురు గాలులతో కూడిన వర్షానికి రహదారులు జలమయ్యాయి.

దీంతో వాహనాదారులు అనేక అవస్థలకు గురయ్యారు. ముఖ్యంగా వర్షం నీటి కాలువలలో పూడికలు సరిగా తీయకపో వడంతోపాటు అనేక చోట్ల వర్షం నీటి కాలువలపై అక్రమ కట్టడాలు ఉన్నాయి. ఏకదాటిగా రెండు గంటలపాటు కురిసిన వర్షానికే ఈవిధంగా ఉంటే ముందుందు వర్షాకాలంలో నగర పరిస్థితి ఏలాగా ఉంటుందో చూడాల్సిందే. అటు జలమండలి, ఇటు జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగంతోపాటు నగర రోడ్లపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేసే ట్రాఫిక్ పోలీసు, అటు లాఅండ్ అర్డర్ పోలీసుల సహకారంతో వర్షంనీటి కాలువలను కట్టడాలను నిర్మించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని వాటిని తొలగించాల్సిన అవసరం భాద్యత ఎంతైనా ఉంది.

దీనికితోడు వర్షంనీటి కాలువలలో పూడికలను సక్రమంగా చేపట్టే విధంగా చూడాల్సిన అవసరం ఉంది. కేవలం ఆయా పార్టీల కార్పొరేటర్లు అక్రమ భవనిర్మాణాలను ప్రోత్సాహిం చడంతోపాటు వసూలపై పెట్టిన శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై పెడితే ఇలాంటి వర్షాలు ఎన్నిసార్లు కురిసిన రోడ్లపై వర్షం నీరు నిలువ కుండా ఉంటుందన్నారు. గంటపాటు దంచికోట్టిన వర్షానికి కోఠి ఇఎన్‌టి ఆసుపత్రి వెనుక వైపు వర్షం నీరు చేరుకుని కుంట లాగా మారింది. ప్రతి సారి వర్షం వచ్చినప్పుడు సమస్య ఈ ఇదే విధంగా ఉంటుది. వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ఘోరంగా ఉంటుంది.

జిహెచ్‌ఎంసి గోషామహల్ సర్కిల్ 14పరిధిలోని ఉస్మాన్‌గంజ్, కోఠి ఇఎన్‌టి ఆసుపత్రి వెనుక వైపు రహదారి, పుత్లీబౌలి, రంగ్‌మహల్ చౌరస్తా, అఫ్జల్‌గంజ్ బడేమియా పెట్రోల్‌పంపు ప్రస్తుతం మూసి వున్న ప్రాంతం, ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ ఆసుపత్రి వైపు రహదారి భారీ వర్షం వస్తే పరిస్థితి ఘోరంగా ఉంటుంది. అసలు ఇంజనీరింగ్ అధికారులు వర్షం వచ్చినప్పుడు ఆ ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి సమస్యను పరిష్కరించే విధంగా చూడాల్సిన అవసరం, భాద్యత ఎంతైనా ఉంది.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ: మల్కాజ్‌గిరి సర్కిల్-28 GHMC

నిట్ నం. కొటేషన్ ప్రకటన నం. 04/EE-28/SBZ/GHMC/2025-26, పని పేరు: స్టేజీ కొరకు ఇనుప మెట్లు, కూల్ వాటర్ క్యాన్స్, బాస్కెట్ బాల్ బోర్డు. పరిమాణం: ప్రతీది, బిడ్ దాఖలు ప్రారంభ తేదీ & సమయం/బిడ్ దాఖలు ముగింపు తేదీ & సమయం: 08.08.2025 ఉ.10.30 గం., & 11.08.2025 ఉ.10.30 గం., అధికారి పేరు & చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 9154796465, తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.28, GHMC
DIPR.No.6235-PP/CL/Advt/1/2025-26, తేది: 08.08.2025



IN THE COURT OF THE HON'BLE XII ADDL DISTRICT AND SESSIONS JUDGE: RANGA REDDY DISTRICT: AT: L.B NAGAR
O.S.No. 264 of 2025

Between :
Sanghubhatla Lalitha Devi, & Others ....Plaintiffs
AND
The Tahasildar Hayathnagar Mandal, R.R. District & others ...... Defendants

To,
All concerned

NOTICE

Whereas the above named plaintiffs have filed above suit for declaration to declare the plaintiffs as Legal Heirs of Late SanghuBhatla Ramakrishna Sharma who died naturally on 26-01-2017 in respect of the "A" suit schedule property i.e. All that the House No. not allowed Plot No 243, Eastern part, in Sy.Nos. 52 to 57, 69 and 70 admeasuring area 133.5 Sq.Yds., equivalent to 111.60 Sq.Mtrs., having Plinth area 610.00 Sq. feet, situated at Prashanth Nagar Colony, Saheb Nagar Khurd Village, Hayathnagar Rev. Mandal, L.B Nagar Municipality, Ranga Reddy District, within the jurisdiction of the Sub- Registrar, Saroor Nagar and bounded by: North 40 Wide Road; South:Plot No.244 Part; East: Plot No. 242;West:Plot No.243 part "B" suit schedule property i.e. All that piece and parcel of land bearing Farm Unit No.431,admeasuring 500 Sq.Yds. equivalent to 418.04 Sq.Mtrs., in Sy.No. 180, situated at Jukal Village, and Grampanchayath, Shamshabad Mandal, Ranga Reddy District and registration at Sub-Registrar office, Shamshabad, Ranga Reddy District and bounded by: North:Farm Unit No. 430;South Farm Unit No.432;East: Farm Unit No. 411;West:33 FT. Wide Road. "C" suit schedule property i.e. All that the Residential Flat No. 105, on the First Floor, of Plinth area 1110 Sq.feet, (including common area and one car parking area), along with undivided share of land admeasuring 35.00 Sq.Yds., or 29.26 Sq.Mtrs (out of 1100 Sq.Yds), in the Buliding name known as Shiva Enclave. On premises bearing House No. 5-1002/58/A, on Plot Nos 58/A & 59/A, in Survey Nos. 592 and 593, situated at Old Alwal, Alwal Village, Under Greater Hyderabad Municipal Corporation, Alwal Circle Malkajgiri Mandal, Ranga Reddy District, and bounded by: North By : Open to Sky;South By : Lift & Open to Sky;EastBy :Corridor;WestBy: Open to Sky. "D" suit schedule property i.e.All that the Residential Flat No. 205, on the Second Floor, of Plinth area 1110 Sq.feet, (including common area and one car parking area), along with undivided share of land admeasuring 35.00 Sq.Yds.,or 29.26 Sq.Mtrs (out of 1100 Sq.Yds), in the Buliding name known as Shiva Enclave. On premises bearing House No. 5-1002/58/A, on Plot Nos. 58/A & 59/A, in Survey Nos. 592 and 593, situated at Old Alwal, Alwal Village, Under Greater Hyderabad Municipal Corporation, Alwal Circle, Malkajgiri Mandal, Ranga Reddy District, and bounded as follows. NorthBy :Open to Sky;South By: Lift & Open to Sky;EastBy : Corridor;WestBy : Open to Sky and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may appear before this Hon'ble court on 02-09-2025 at 10.30 AM. either in person or through an advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// BY ORDER OF THE COURT//
M/s POCHAMPALLY GIRIDHAR, N.BALAKRISHNA
advocates
B-436, 1st Floor, Near Red Water Tank, Vanasthalipuram, Hyderabad.
Mobile No. 7013191874



IN THE COURT OF THE HON'BLE Prl. JUNIOR CIVIL JUDGE-CUM-IV JUDICIAL MAGISTATE OF FIRST CLASS MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: L.B. NAGAR
OS. No. 844 OF 2025

Between:
**Gyara Leelavati** W/o Late.Gyara Yadagiri, Aged about 45 years, Occ: House wife. R/o H.No.2-47/F-3, Mallikarjuna Nagar, Peerjadiguda, Medipally, Mandal, Medchal-Malakjgir District. ...Plaintiff
AND
1. Tahsildar Medipally
2. All Concern ...Defendants

PUBLIC NOTICE

To
All concerned

Take notice that the plaintiff filed above case for declaration, to declare them as legal heirs of Gyara Yadagiri S/o Late. G. Pentaiah The said matter has been posted to **21-08-2025**, for objection if any from third party, if anybody has got any objection appear before the above Hoble court on 21-08-2025 at about 10.30 am if not received any objection the matter will be determined by the Honble court.

**N.L KANTHA RAO**
Advocate
Hyderabad
Cell No.9490100058



PUBLIC NOTICE

This is to inform the general public that we, **Mr. Manikanta Prasad Javvadi,** son of Javvadi Gurraju, Age: 31 Years, residing at Sy No. 182/Part, G-3, Balaji Residency, Mallampet, 500090 and Mrs. Soujanya Chikkulla, daughter of Prasad Rao Chikkulla, Age: 25 Years, residing at 3-22, Enkoor, VTC Enkuru, PO Enkoor, Sub District: Enkuru, Khammam, Telangana, 507168, were married, but due to irreconcilable differences, we have decided to separate and have obtained a mutual consent divorce. Our marriage has been dissolved on **07/08/2025.** From this date forward, we have no relationship with each other, either social, financial, or personal. We shall not be responsible for any debts, liabilities, or actions of each other from this day forward. Any person dealing with either of us on the basis of our previous marital relationship will do so at their own risk. This notice is issued for the information of the general public.

**Sd/- Manikanta Prasad Javvadi**
**Tadiboina Vasudeva Yashasri**
**Arun Bhargav**
**Advocates**
Office: 3-4-63/19/E, Sri Ramanapuram Colony, Ramanthapur, Uppal, Hyderabad, Telangana, 500039
E-Mail: Advocate.Vasudeva.Yashasri@Gmail.com
Phone no: +91 9666321479



బహిరంగ ప్రకటన

హైదరాబాద్‌లోని గౌరవనీయ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ బెంచ్ ముందు, C.P (CAA) NO.30/230/HDB/2025 C.A.తో అనుసంధానించబడి ఉంది. (CAA) నం.15/230/HDB/2025 కంపెనీల చట్టం, 2013 (18 ఆఫ్ 2013) సెక్షన్ 230 నుండి 232 వరకు మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క అన్ని ఇతర వర్తించే నిబంధనల విషయంలో మరియు గోల్డెన్ ఆర్గానిక్ ప్రొడక్ట్ లిమిటెడ్ (ఫస్ట్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు నవశక్తి స్పింటెక్స్ లిమిటెడ్ (సెకండ్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు సత్య హైబ్రిడ్ సీడ్ ప్రైవేట్ లిమిటెడ్ (థర్డ్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు విక్టర్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (నాల్గవ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) ల విలీన పథకం విషయంలో శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరీ కంపెనీ) మరియు వారి సంబంధిత వాటాదారులు మరియు క్రెడిటర్లు

**గోల్డెన్ ఆర్గానిక్ ప్రొడక్ట్ లిమిటెడ్,** కంపెనీల చట్టం, 2013 నిబంధనల ప్రకారం స్థాపించబడిన కంపెనీ, CIN: U01403TG2013PLC091227 కలిగి ఉంది మరియు దాని రిజిస్టర్డ్ కార్యాలయం 7-1-621/34, 5వ అంతస్తు, సంజీవ రెడ్డి నగర్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా-500038 వద్ద ఉంది, దీని డైరెక్టర్ శ్రీమతి లీలావతి గోనుగుంట్ల, (DIN: 00035560), ఫోన్: +91-9866778837, ఇ-మెయిల్: taxation.gopl@gmail.com ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**నవశక్తి స్పింటెక్స్ లిమిటెడ్,** కంపెనీల చట్టం, 1956 నిబంధనల ప్రకారం స్థాపించబడిన కంపెనీ, CIN: U18204TG2006PLC050562 కలిగి ఉంది మరియు దాని రిజిస్టర్డ్ కార్యాలయం 7-1-621/98-621/34, నార్త్ బ్లాక్, 3వ అంతస్తు, శివశక్తి టవర్స్, UTI బ్యాంక్ ఎదురుగా, S.R.నగర్, మెయిన్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా-500038 వద్ద ఉంది, దీని డైరెక్టర్ శ్రీమతి లీలావతి గోనుగుంట్ల, (DIN: 00035560), ఫోన్: +91-9866778837, ఇమెయిల్: taxation.spintex@gmail.com ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**సత్య హైబ్రిడ్ సీడ్ ప్రైవేట్ లిమిటెడ్,** కంపెనీల చట్టం, 1956 నిబంధనల ప్రకారం స్థాపించబడిన కంపెనీ, CIN: U01122TG2009PTC063549 కలిగి మరియు 7-1-621/98, S.R.నగర్, హైదరాబాద్, తెలంగాణ, భారతదేశం 500038 వద్ద రిజిస్టర్డ్ కార్యాలయాన్ని కలిగి ఉంది, దీని డైరెక్టర్ శ్రీమతి లీలావతి గోనుగుంట్ల, (DIN: 00035560), ఫోన్: +91-9866778837, ఇమెయిల్: taxation.satya@gmail.com ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**విక్టర్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్,** కంపెనీల చట్టం, 1956 నిబంధనల ప్రకారం స్థాపించబడిన కంపెనీ, CIN: U01100TG2004PTC044805 కలిగి ఉంది మరియు దాని రిజిస్టర్డ్ కార్యాలయం 7-1-621/98-621/34, సౌత్ బ్లాక్, 4వ అంతస్తు, శివశక్తి టవర్స్, UTI బ్యాంక్ ఎదురుగా, S.R. నగర్, మెయిన్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ, భారతదేశం -500038 వద్ద ఉంది, దీని డైరెక్టర్ శ్రీమతి లీలావతి గోనుగుంట్ల, (DIN: 00035560), ఫోన్: +91-9866778837, ఇమెయిల్: taxation.vbpl@gmail.com ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్,** కంపెనీల చట్టం, 1956 నిబంధనల ప్రకారం స్థాపించబడిన కంపెనీ, CIN: U15100TG1998PLC028724 కలిగి ఉంది మరియు దాని రిజిస్టర్డ్ కార్యాలయం D.No. 7-1-621/98-621/34, U.T.I. బ్యాంక్ ఎదురుగా, సంజీవ రెడ్డి నగర్, హైదరాబాద్, తెలంగాణ, భారతదేశం 500038 వద్ద ఉంది, దీని డైరెక్టర్ శ్రీమతి లీలావతి గోనుగుంట్ల, (DIN: 00035560), ఫోన్: +91-9866778837, ఇమెయిల్: taxation@sivashakthi.net ద్వారా ప్రాతినిధ్యం వహిస్తుంది.

పిటిషనర్ కంపెనీలు

**కంపెనీల (సర్దుబాట్లు, ఏర్పాట్లు మరియు విలీనాలు) నియమాలు, 2016 యొక్క 16వ నిబంధనతో చదువబడే, హైదరాబాద్‌లోని గౌరవనీయ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ బెంచ్ ఆదేశం ప్రకారం జారీ చేయబడిన పిటిషన్ విచారణ నోటీసు.**

గోల్డెన్ ఆర్గానిక్ ప్రొడక్ట్ లిమిటెడ్ (ఫస్ట్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు నవశక్తి స్పింటెక్స్ లిమిటెడ్ (సెకండ్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు సత్య హైబ్రిడ్ సీడ్ ప్రైవేట్ లిమిటెడ్ (థర్డ్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు విక్టర్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (ఫోర్త్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) లు శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) తో 2013 సెక్షన్ 230 నుండి 232 వరకు జాయింట్ కంపెనీ పిటిషన్‌ను 02.07.2025న ఎలక్ట్రానిక్‌గా మరియు 04.07.2025న భౌతికంగా హైదరాబాద్‌లోని గౌరవనీయులైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్‌లోని బెంచ్ ముందు దాఖలు చేశాయని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. గోల్డెన్ ఆర్గానిక్ ప్రొడక్ట్ లిమిటెడ్ (ఫస్ట్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు నవశక్తి స్పింటెక్స్ లిమిటెడ్ (సెకండ్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు సత్య హైబ్రిడ్ సీడ్ ప్రైవేట్ లిమిటెడ్ (థర్డ్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు విక్టర్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ (ఫోర్త్ ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) లను శివశక్తి అగ్రిటెక్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు వారి సంబంధిత వాటాదారులు మరియు రుణదాతలతో విలీనం చేసే పథకానికి అనుమతి పొందాలని కోరుతోంది. ఈ కంపెనీ పిటిషన్‌ను గౌరవనీయ ట్రిబ్యునల్ స్వీకరించింది మరియు జూలై 24, 2025న గౌరవనీయ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం, ఈ కంపెనీ పిటిషన్‌ను సెప్టెంబర్ 04, 2025న హైదరాబాద్‌లోని గౌరవనీయ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, బెంచ్ ముందు విచారణకు నిర్ణయించారు. ఈ పిటిషన్‌ను సమర్థించాలనుకునే లేదా వ్యతిరేకించాలనుకునే ఎవరైనా, పిటిషనర్ న్యాయవాది సంతకం చేసిన తన ఉద్దేశ్యాన్ని పిటిషనర్ న్యాయవాదికి తన పేరు మరియు చిరునామాతో పంపాలి, తద్వారా పిటిషన్ విచారణకు నిర్ణయించిన తేదీకి రెండు రోజుల ముందు (అంటే సెప్టెంబర్ 01, 2025న లేదా అంతకు ముందు) పిటిషనర్ న్యాయవాదికి చేరాలి. అతను/ఆమె/వారి పిటిషన్‌ను వ్యతిరేకించాలని కోరుకునే చోట, వ్యతిరేకతకు గల కారణాలను లేదా అఫిడవిట్ కాపీని అటువంటి నోటీసుతో పాటు అందించాలి. నిర్దేశించిన ఛార్జీలు చెల్లించిన తర్వాత, పిటిషన్ మరియు/లేదా గౌరవనీయ ట్రిబ్యునల్ ఆదేశం యొక్క కాపీని కింద సంతకం చేసిన వ్యక్తి ఎవరైనా దానిని కోరుతూ అందజేస్తారు.

**సం/- లోకేష్ అగర్వాల్**
పిటిషనర్ కంపెనీల న్యాయవాది
ఫ్లాట్ నెం. 504, 5వ అంతస్తు, MGR ఎస్టేట్స్, ద్వారకాపురి కాలనీ
పంజాగుట్ట, హైదరాబాద్ - 500082
(మొబైల్: 9700884008, 6304615511)
తేదీ: 09.08.2025
ప్రదేశం: హైదరాబాద్

## షిరిడినగర్‌లో మైనంపల్లి హనుమంత రావు పర్యటన



**మల్కాజిగిరి ఆగస్టు. 8.ప్రభాతవార్త :**
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని షిరిడి నగర్‌లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ తో కలిసి రాత్రి కురిసిన వర్షానికి జలమయమైన ప్రాంతాల్లో పర్యటించి సమస్య పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాకాంతరెడ్డి, వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, ఉమేష్ సింగ్, బాబు సత్యనారాయణ గుండా నిరంజన్ సత్యమూర్తి బ్రహ్మయ్య రాము రామకృష్ణ అరుణ్, సయ్యద్ మబ్బు,యాదగిరి, బాల్ రాజ్ యాదవ్, నహీం బాయ్,వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో చక్కటి ఆరోగ్యం

**-మర్కజి అంజుమన్ ఇ మహదవియ అధ్యక్షుడు మునావర్ ఖాన్**



సమావేశంలో ప్రసంగిస్తున్న మర్కజి అంజుమన్ ఇ మహదవియ అధ్యక్షుడు మునావర్ ఖాన్ తదితరులు

**మలక్ పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త:** క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని మర్కజి అంజుమన్ ఇ మహదవియ అధ్యక్షుడు మునావర్ ఖాన్ పేర్కొన్నారు. చంచల్ గూడా లోని మర్కజి అంజుమన్ ఇ మహదవియ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎం. ఏ. ఎం స్పోర్ట్స్ క్లబ్ ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు, యువత స్పోర్ట్స్ క్లబ్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మర్కజి అంజుమన్ ఇ మహదవియ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, కమిటీ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## హైకోర్టు కాలనీ ముఖద్వార నిర్మాణానికి భూమిపూజ



హైకోర్టు కాలనీ ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

**వనస్థలిపురం. ఆగస్టు. 8.ప్రభాతవార్త :**
హయత్ నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ నందు నూతనంగా నిర్మించదలచిన ఆర్చి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు.ఇట్టి కార్యక్రమంలో పలువురు భారస పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, కాలనీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రేపు యాప్రల్-కంది గూడలో బోనాల జాతర సందడి

**-ప్రముఖులను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు**



**నేరెడ్‌మెట్ జులై 8, ప్రభాతవార్త :**
శ్రావణ మాసం బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి భక్తి శ్రద్ధల తో బోనాలు సమర్పణ యాప్రల్, కంది గూడ ప్రాంతాల్లో ని తూట్టమైసమ్మ, మహాంకాళి, నల్లపోచమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాలు పండుగ వాతావరణంలో ముస్తాబయ్యాయి. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్, మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, జవహర్‌నగర్ ఇన్స్పెక్టర్ సైదయ్య ముఖ్య అతిథులుగా రావాలని ఆహ్వానం పలికారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బోనాలు సమర్పించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని ఆలయ కమిటీ పిలుపునిచ్చింది.

## లయోలా మోడల్ స్కూల్లో ఘనంగా రక్షాబంధన్



రాఖీలు కట్టుకున్న చిన్నారులతో ఉపాధ్యాయురాలు

**హయత్ నగర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**
అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధి తారమాతి పేట్ గ్రామంలోని లయోలా మోడల్ స్కూల్లో శుక్రవారం ఘనంగా రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి, స్వీట్స్ తినిపించారు. అన్నయ్యగా నువ్వు నాకు రక్ష... నీకు దేవుడి రక్ష అంటూ స్లోగన్స్ ఇచ్చారు. చిన్నారులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

## వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మైనంపల్లి పూజలు

**మల్కాజిగిరి ఆగస్టు 8, ప్రభాతవార్త:**
ఆనంద్ బాగ్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రవీందర్ రెడ్డి కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ నాయకులు లక్ష్మాకాంతరెడ్డి వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, గుండా నిరంజన్ డివిజన్ అధ్యక్షులు సంపత్ గౌడ్ వైనాల ప్రవీణ్ వినోద్ యాదవ్ సత్యమూర్తి, మాజీ చైర్మన్లు ఉమేష్ సింగ్ సంతోష్ రాందాస్ ముదిరాజ్ బాబు సత్యనారాయణ ఆలయ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సానాది శంకర్ కుమార్ గణేష్ సురేష్ సింగ్, చారి, ఇస్తారీ, దేవేందర్ బ్రహ్మయ్య, బాలరాజు యాదవ్ యాదగిరి రాము తదితరులు పాల్గొన్నారు.

## చాదర్‌ఘాట్ మూసి పరివాహక ప్రాంతంలో కలెక్టర్ హరిచందన పర్యటన

**-మూసిలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అధికారులతో సమీక్ష**



చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 8, ప్రభాతవార్త:**
నగరంలో కొద్ది రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల మూలంగా హుస్సేన్ సాగర్ రెండు గేట్లను ఎత్తివేసి నీటిని వదలడంతో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతాన్ని శుక్రవారం సాయంత్రం సందర్శించి పరిశీలించారు. చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతం వెంబడి మూసానగర్, ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ లోని శంకర్ నగర్ మూసి పరివాహక ప్రాంతంలో ఆర్డీవో రామ కృష్ణ, అంబర్ పేట తాహసిల్దార్ అన్వర్, హిమాయత్ నగర్ తాహసిల్దార్ సంధ్యారాణి, నాంపల్లి తాహసిల్దార్ నయం, వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. హుస్సేన్ సాగర్ రెండు గేట్లు ఎత్తిన నేపథ్యంలో మూసిలో వరద ప్రవాహం పెరుగుతున్నందున ముసి పరివాహక ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. జిహెచ్ఎంసి, రెవిన్యూ, హైడ్రా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారని ఆమె వివరించారు. మూసిలో వరద నీరు సాఫీగా వెళ్ళిపోతుందా లేదా ఏమైనా ఆటంకాలు ఉన్నాయా, మూసి పరివాహక ప్రాంతం ముంపునకు గురయ్యే అవకాశాలు ఏమైనా ఉన్నాయా ఉంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై ఆమె అధికారులతో సమీక్షించారు. మూసి పరివాహక ప్రాంతం ముంపున గురయ్యే అవకాశాలు లేవని వారు తెలిపారు. మూసిలో వరద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు సమర్పించి తనకు తెలియజేయాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరద ప్రవాహం తగ్గే వరకు జిహెచ్ఎంసి, రెవెన్యూ, డిఆర్ఎఫ్, హైడ్రా సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి గణపతికి రాఖీలు కట్టి భక్తిని చాటిన జాగృతి అభ్యుదయ సంఘం హరిత సైన్యం



మట్టి గణపతికి రాఖీలు కడుతున్న జాగృతి అభ్యుదయ సంఘం హరిత సైన్యం

**వనస్థలిపురం. ఆగస్టు. 8.ప్రభాతవార్త.**
వినాయక చతుర్థిని పురస్కరించుకుని జాగృతి అభ్యుదయ సంఘం హరిత సైన్యం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తమవంతు బాధ్యతగా తమ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వాతావరణ సమతుల్యతకు తామంతా పూనుకుంటామని మన సనాతన హిందూ సంప్రదాయం ఐన మట్టి గణపతిని మా ఇళ్ళలో పూజించుకుంటామని, నిమజ్జనం కూడా మంచినీటి గంగాళంలో సందడిగా జరుపుకుంటామని తమ నిర్ణయాన్ని ప్రకటిస్తూ వినాయకుడి పట్ల వారికున్న అచంచలమైన భక్తిని ప్రదర్శిస్తూ జాగృతి కార్యాలయంలోని పర్యావరణ మట్టి గణపతి విగ్రహానికి రాఖీలు కట్టి లంబోదరునికి జేజేలు పలికారు. వినాయక నవరాత్రులు కూడా ఎటువంటి కాలుష్య కారక వస్తువులు వాడమని, ప్రత్యేకించి ఒక్కసారి వారి పారేసే ప్లాస్టిక్ జెండాలు, అలంకరణ సామగ్రి, సంచులు వాడబోమని, అన్నదానం చేసే క్రమంలో క్యాన్సర్ కారక ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసుల స్థానంలో శ్రమ అనుకోకుండా తిరిగి వాడుకునే స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వాడుకుంటామని, విగ్రహాన్ని పసుపు, కుంకుమ, బియ్యం పిండి తదితర సహజ రంగులు, పూలు, పత్రి, పండ్లతోనే అలంకరించుకుని మా జీవితంలో ఎటువంటి విఘ్నాలు కలగకుండా చూడమని గణపతిని మొక్కుతామని అన్నారు.ఈ జాగృతి అభ్యుదయ సంఘం హరిత సైన్యాన్ని స్ఫూర్తిగా చేసుకుని పిల్లలు, పెద్దలందరూ పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని, పోటీలు పడే వినాయక మండపాల నిర్వాహకులు విగ్రహం ఎత్తులో కాకుండా అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, సేవా కార్యక్రమాల్లో పోటీ పడటం వలన మన జల వనరులకు, సమాజానికి మేలు జరుగుతుందని భావన శ్రీనివాస్ తోటి హిందూ భక్తులకు సూచించారు.మారెళ్ళ దుర్గా ప్రసాద్, చెర్రి, ప్రీతి, క్రితిక, దీక్షిక, గోమయి, పవిత్ర, హర్షిత, విఘ్నేష్, బాలు, మహేష్, రామ్ దాస్ పాల్గొన్నారు.

## పటిష్టంగా నాలా నిర్మాణం చేపట్టాలి : కార్పొరేటర్

### వార్త కథనానికి స్పందన



కూలిన నాలాను పరిశీలిస్తున్న పవన్‌కుమార్, రామేశ్వర్‌గౌడ్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**
అర్ధాంతరంగా కూలిపోయిన నాలాను పటిష్టంగా నిర్మించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ సూచించారు. శుక్రవారం వార్తలు ప్రచురితమైన 'కూలిన నాలా స్లాబ్ తప్పిన పెను ప్రమాదం' కథనానికి స్పందించిన జిహెచ్ఎంసి సరూర్ నగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కార్పొరేటర్ కొత్తపేట డివిజన్ బృందావన్ కాలనీలో కూలిన నాలా పనులను పరిశీలించారు. ఇంటి నిర్మాణదారుడు తులసీదాస్, స్థానికుడు రామేశ్వర్ గౌడ్ అసంపూర్తిగా జరుగుతున్న నిర్మాణం పనులను గురించి వారికి వివరించారు. నిర్మాణం పనులు పటిష్టంగా చేపట్టాలని భవిష్యత్తులో ఇబ్బంది కలగకుండా అధికారులు, కాంట్రాక్టర్ జాగ్రత్తలు వైన్నాలని కూడా విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ నిర్మాణం విషయంలో ఎటువంటి రాజీ లేకుండా నాణ్యత ప్రమాణాలతో కూలిన నాలా నిర్మాణం జరపాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, కాంట్రాక్టర్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండు పనులు చేయాలని సూచించారు. అదేవిధంగా గాయత్రి పురం ప్రధాన రహదారిలో రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మూడు కాలనీలను కలిపే ప్రధాన రహదారి కావడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిలు ఎదురవుతున్నాయన్నారు. వెంటనే మరమ్మత్తులు చేయాలని అధికారులకు ఎంపి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ ఎల్ కాలనీ అధ్యక్షులు సుధాకర్, కొరివి శ్రీనివాస్, మహేష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలి : చైర్మన్ డాక్టర్ నాగయ్య




విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోవర్ధని తదితరులు

**మలక్ పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నత లక్ష్యలను ఎంచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి నాగయ్య పేర్కొన్నారు దిల్ షుక్ నగర్ సిద్ధార్థ జూనియర్, డిగ్రీ కో ఎడ్యుకేషన్, మహిళా డిగ్రీ కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, అంకుటిత దీక్షతో తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు పట్టుదల, కృషి తో దేనినైనా సాధించవచ్చునని, విద్యార్థులు కష్టపడే తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలిగి తీయడానికి తమ కళాశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. సృజనాత్మకతను పదును పెట్టేందుకు అనేక అంశాలపై వారికి శిక్షణ ఇస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులకు ప్రణాళిక బద్ధమైన బోధనతో పాటు సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తమ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్లు నిర్వహిస్తూ, చదువు పూర్తవ్వగానే ఉద్యోగం లభించేలా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి 8 బంగారు పతకాలను సాధించిన ఏకైక విద్యా సంస్థ సిద్ధార్థ విద్యాసంస్థలు అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం తమ కళాశాల నిర్వహిస్తున్న క్యాంపస్ ప్లేస్మెంట్ ల ద్వారా వందలాది మందికి పలు సంస్థలలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. వివిధ అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధిని, కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ సల్మా సుల్తానా, ప్రిన్సిపాల్ త్రివేణి కాంచన, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అకాడమిక్ డైరెక్టర్లు వంశీకృష్ణ, మోహన్ రావు, రామ్ రెడ్డి , మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బహుజన ప్రజా వీరుడు పండుగ సాయన్న జయంతి



మహేశ్వరం నియోజకవర్గ మినీ ట్యాంక్‌బండ్ జిల్లెలగూడ చందన చెరువు కట్టపై పండుగ సాయన్న జయంతిని నిర్వహిస్తున్న మీర్‌పేట్ కార్పొరేషన్ ముదిరాజ్ ముఖ్యులు

**సరూర్‌నగర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** నాటి నిజాం పాలనలో ప్రజల ధన మాన ప్రాణాలను హరిస్తున్న దొరలు, దేశ్‌ముఖ్‌లకు సింహస్వప్నమై పోరాడి సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించే క్రమంలో అమరుడైన తెలంగాణ రాబిన్‌హుడ్, ప్రజా వీరుడు పండుగ సాయన్న జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మినీ ట్యాంక్ బండ్ జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ప్రజా వీరుని జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ముదిరాజ్ ముఖ్యులు సాయన్న భారీ విగ్రహానికి పూలమాలలతో పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అణగారిన ప్రజలకు స్ఫూర్తి పండగ సాయన్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ముదిరాజ్ అధ్యక్షుడు ప్రకాశ్ ముదిరాజ్, పృథ్వీరాజ్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు బొమ్మరబోయిన యాదిగిరి ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సుదర్శన్ ముదిరాజ్, మెకం యాదగిరి ముదిరాజ్, మీర్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు గడ్డమీది రేఖ లక్ష్మణ్ ముదిరాజ్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ బొమ్మకంటి దయానంద్ ముదిరాజ్, మీర్‌పేట్ కార్పొరేషన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి.శివశంకర్ ముదిరాజ్, జిల్లెలగూడ అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, మేకల కృష్ణ ముదిరాజ్, సాయం వెంకటేశ్ ముదిరాజ్, నక్కల కృష్ణ ముదిరాజ్, గుమ్మాల జంగయ్య ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్ పాల్గొన్నారు.

## మనిష్‌ను సన్మానించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, ఆగస్టు 8 ప్రభాతవార్త :** కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన నాచారంకు చెందిన మనీష్ యాదవ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బిఎల్ఆర్, బీఆర్ఎస్ సీనియర్ సాయిజన్ శేఖర్ తదితరులు నాచారంలో ఘనంగా సన్మానించి అభినందించారు. సౌత్ ఆఫ్రికాలోని టంజానియా దేశంలోని కిలిమంజార్ పర్వతాన్ని మనీష్ యాదవ్ అధిరోహించడం ఎంతో గొప్ప విషయం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం మనీష్ యాదవ్ మాట్లాడుతూ భవిష్యత్తులో మిగిలిన ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ తదితరులు

**నాచారం, ఆగస్టు 8 ప్రభాతవార్త :** నాచారం డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ కోట్లాది రూపాయల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వరలక్ష్మి దేవి అలంకారంలో శ్రీ విజయ దుర్గామాత



కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ

**సైదాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** సైదాబాద్ మాతా మైదానంలోని శ్రీ విజయ దుర్గా మాత శుక్రవారం వరలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్త కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి సభ్యులు రవి శంకర్, సునీల్‌రెడ్డి, సంగీత రెడ్డి, సంతోషి, కౌసల్య, నాగమణి, శ్రీలక్ష్మి, మధుమతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలి



వాటర్‌వర్క్స్ ఎండికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్‌లోని దామోదరం సంజీవయ్య నగర్, బృందావన్ కాలనీలలోని డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శుక్రవారం హెచ్ఎండబ్లుఎస్ అండ్ ఎస్‌బి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దామోదరం సంజీవయ్య నగర్, బృందావన్ కాలనీలలో చాలా ఏళ్లకిందట వేసిన యుజిడి ఉన్నందు వల్ల తరచుగా సమస్యలు తలెత్తుతుండడంతో స్థానికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని. వెంటనే నిధులు మంజూరు చేయాలని, తగిన మరమ్మత్తులు చేపట్టాలని కార్పొరేటర్ కోరారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ క్రికెట్ పోటీల్లో ఘనవిజయం



**తుర్కయంజాల్ ఆగస్టు8, ప్రభాతవార్త :** నిత్యం ప్రజా సమస్యలతో బిజీగా ఉండే మున్సిపల్ అధికారులు క్రికెట్ బ్యాట్ పట్టి సిక్స్ లు, బౌండరీలు కొట్టడమే కాకుండా బాల్ పట్టి వికెట్ పడగొట్టారు. శుక్రవారం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని క్రికెట్ మైదానంలో తుర్కయంజాల్ , ఆదిభట్ల పురపాలక సంఘల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ క్రికెట్ ట్రోఫీ లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ విజేతగా నిలిచింది. ఈ క్రికెట్ ట్రోఫీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుర్కయంజాల్ , ఆదిభట్ల , పెద్ద అంబర్పేట్ పెట్ కే.అమరేందర్ రెడ్డి , బాల కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ... క్రీడల్లో గెలుపు , ఓటములు సహజమని , ఆటల పోటీలు ద్వారా మానసిక ప్రశాంతత , క్రీడాకారుల మధ్య స్నేహ పూర్వకమైన బంధాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. మొదటగా బ్యాటింగ్ చేసిన తుర్కయంజాల్ మున్సిపాలిటీ 12 ఓవర్లకు 97 పరుగులు సాధించింది. అనంతరం ఆదిభట్ల మున్సిపాలిటీ 12 ఓవర్లకు గాను 70 పరుగులు చేసింది. 27 పరుగులతో విజయం సాధించిన తుర్కయంజాల్ మున్సిపాలిటీకి ఇరు మున్సిపల్ కమిషనర్ లు ట్రోఫీని అందించడం జరిగింది. క్రీడాకారులకు బహుమతులను అందించి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.ఈ , ఎ.ఈ , ఆర్వో, వివిధ సెక్షన్ నుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



అమ్మవారికి పూజ నిర్వహిస్తున్న గురుమాత సోమ వెంకటమ్మ

**ఎల్.బి.నగర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లోని శ్రీ దుర్గాభవాని, శ్రీరేణుకఎల్లమ్మ దేవాలయంలో శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా దేవాలయంలో దేవాలయం వ్యవస్థాపకురాలు, పిఠాధిపతి గురుమాత, శ్రీమాత శక్తిపీఠం దేవిఉపాసకురాలు సోమ వెంకటమ్మ అమ్మవారి ఆధ్వర్యంలో అమ్మవారి వ్రతం నిర్వహించారు.సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల ప్రజలందరూ సుభిక్షంతో ఉంటారని, ప్రజలందరూ ఆనంద జీవితం గడపాలని అన్నారు.అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

## భారీ వర్షంతో కాలనీవాసులకు ఇబ్బందులు



సమస్యను పరిశీలిస్తున్న అరవింద్‌శర్మ, నగేష్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** భారీవర్షం కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్లో రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈస్ట్‌యాదవనగర్‌కాలనీలో వరద పోటెత్తడంతో శుక్రవారం టిఆర్ఎస్ నాయకులు ఆ కాలనీలో పర్యటించి సమస్యలను సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షం కారణంగా నివాసాల్లో వర్షంనీరుచేరి కార్లు, బైకులు కొట్టుకుపోయాన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు కాలనీలో సందర్శించి సమస్యలను పరిశీలించామని, అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల శేఖర్, కాలనీవాసులు రఘు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## బోనాల జాతరకు రావాలని మైనంపల్లికి ఆహ్వానం



**నేరెడ్‌మెట్, జులై 8,ప్రభాతవార్త**
యాప్రాల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు కుతాడి గోపి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 10న నేరెడ్ మెట్ డివిజన్ యాప్రాల్ లో నిర్వహించె బోనాల జాతర కు ప్రత్యేకంగా మాజీ ఎమ్మెల్యే డైనమిక్ లీడర్ మైనంపల్లి హనుమంతరావుకు ఆహ్వానాన్ని పలికారు. కూతాడి గోపి ఆధ్వర్యంలో రంగనాథ స్వామి ఆలయం పరిసర ప్రాంతంలో బోనాల జాతర ఉత్సవం డీజే లైట్లు,పోతురాజుల విన్యాసం,కళాకారుల నృత్యం తదితర అంశాలతో భక్తులను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠాతన



**మేడిపల్లి ఆగస్టు 8 ప్రభాతవార్త ;** పీర్జాదిగూడ కార్పొరేషన్ పర్వతాపూర్ లో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ పునఃప్రతిష్టా మహోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్న పునఃప్రతిష్టా మహోత్సవాలు, ప్రముఖ వేదపండితులు నరేష్ శర్మ నేతృత్వంలోని వేద పండితుల బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాల ఘోష మధ్య, శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్లు జక్క వెంకట్ రెడ్డి , అమర్ సింగ్,బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ గ్రంధాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ ,బైటింటి శారద ఈశ్వర్ రెడ్డి ,బండారి మంజుల రవీందర్ , పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి , మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుమల జగదీశ్వర్ రెడ్డి , నాయకులు జైహింద్ గౌడ్ , చిలుముల శంకర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు,మేడిపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ కావడపు రామ్ రెడ్డి , పోచమ్మ టెంపుల్ కమిటీ సభ్యులు,పర్వతాపూర్ కాలనీవాసులు ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి



**సరూర్‌నగర్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వ్యాపారాలు నిర్వహించే వారు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని అసిస్టెంట్ మున్సిపల్ కార్పొరేషన్ జాన్ కృపాకర్ సూచించారు. కార్పొరేషన్‌లో నిర్వహిస్తున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 68వ రోజు శుక్రవారం ట్రేడ్ లైసెన్స్‌ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మున్సిపల్ కార్పొరేషన్ వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో కలిసి వివిధ డివిజన్లలోని వర్తక, వ్యాపార దుకాణాలను సందర్శించి ట్రేడ్ లైసెన్స్‌లపై ఆరా తీశారు. ఈ మేరకు లైసెన్స్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి షాపు యజమాని, వ్యాపారాలు నిర్వహించే వారు విధిగా లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు కొనసాగిస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమీషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ వంకాయల యాదగిరి, కార్పొరేషన్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్, వార్డు ఆఫీసర్లు సింహాచలం, ఓంప్రకాశ్ తదితరులు, పలువురు బిల్ కలెక్టర్లతో పాటు డొమ్నిక్, సుదర్శన్, రాజు పాల్గొన్నారు.